కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రిక
కార్యాలయం నందు పని చేయుటకు
విలేఖరులు కావలెను.
సెల్: 9393949345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 305 విశాఖపట్నం, 23 సెప్టెంబరు 2023 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## కేంద్ర ఉక్కు కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హాకు ఉక్కు కార్మికులతో కలిసి విజ్ఞప్తి చేసిన జీవీఎల్

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శుక్రవారం బీజేపీ రాజ్యసభ ఎంపి జీవీఎల్ నరసింహారావు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హాతో సమావేశమై ఆర్ఐఎన్ఎల్, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, అధికారులకు సంబంధించిన పలు సమస్యలపై సుదీర్ఘ చర్చలు జరిపారు. ఎంపి జివిఎల్‌తో పాటు ఆర్ఐఎన్ఎల్‌కు చెందిన స్టీల్ ఎగ్జిక్యూవ్స్ అసోసియేషన్ (ఎస్ఇఎ) ప్రధాన కార్యదర్శి కెవిడి ప్రసాద్ మరియు ఇతరులు ఉన్నారు.

ఆర్ఐఎన్ఎల్ బోర్డు ద్వారా ప్రమోషన్ పాలసీని ఖరారు చేయడంలో జాప్యం కారణంగా 2019 నుండి పెండింగ్‌లో ఉన్న ఆర్ఐఎన్ఎల్ ఎగ్జిక్యూటివ్‌ల పదోన్నతుల పెండింగ్ సమస్యను ఈ సమావేశంలో ఎంపీ జీవీఎల్ నరసింహారావు హైలైట్ చేశారు.

గత వారం, విశాఖపట్నంలో, ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఆర్ఐఎన్ఎల్ ఎగ్జిక్యూటివ్‌లను కలిశారు. ఇందులో అనేక మంది యువ ఇంజనీర్లు 2012లో ప్రీమియర్ ఇంజనీరింగ్ కళాశాలల నుండి పెద్ద ఆశలు మరియు ఆకాంక్షలతో ఆర్ఐఎన్ఎల్‌లో చేరారు. ఈ యువ ఇంజనీర్లకు 2021 నుంచి టైమ్‌బౌండ్ ప్రమోషన్లు ఇవ్వడం లేదని, దీంతో వారి నైతిక స్థైర్యం బాగా తగ్గిపోయిందని (మిగతా 2లో)



## చంద్రబాబు నాయుడుకు రెండురోజుల సీఐడీ కస్టడీ



తెలుగుదేశం అధినేత చంద్రబాబును సీఐడీ రెండు రోజులు విచారించనుంది. సీఐడీ అయిదు రోజుల విచారణకు అనుమతి ఇవ్వాలని ఏసీబీ కోర్టును కోరింది. దీని పైన విచారణ చేసిన న్యాయస్థానం.. రెండు రోజులు రిమాండ్ పొడిగించటంతో ఆ రెండు రోజులు సీఐడీ కస్టడీకి ఇస్తూ తీర్పు వెలువరించింది. అదే సమయంలో చంద్రబాబు విచారణ వేళ కొన్ని నిబంధనలను స్పష్టం చేసింది. చంద్రబాబు బెయిల్ పై సోమవారం విచారణ జరగనుంది.

చంద్రబాబును సీఐడీ రేపటి నుంచి రెండు రోజుల పాటు విచారణ చేయనుంది. ఇందుకు అనుమతి ఇచ్చిన ఏసీబీ కోర్టు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. ఆది, సోమ వారాల్లో రాజమండ్రి జైలులోనే చంద్రబాబును విచారిస్తామని సీఐడీ చెప్పటంతో కోర్టు అందుకు అనుమతించింది. చంద్రబాబు లాయర్లు ఒకరు లేదా ఇద్దరి సమక్షంలో విచారణ చేయాలని సూచించిన న్యాయస్థానం...విచారణ చేసే అధికారుల పేర్లను సీఐడీ నుంచి సేకరించింది. ఈ రెండు రోజులు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విచారణ చేయాలని నిర్దేశించింది.

నివేదిక సీల్డ్ కవర్లో ఇవ్వాలని ఆదేశించిన న్యాయస్థానం.. విచారణ సమయంలో వీడియో, ఫోటోలు బయటకు వెళ్లకూడదని స్పష్టం చేసింది. దీంతో, చంద్రబాబు తరపు న్యాయవాదులు 12 పేర్లతో విచారణ సమయంలో హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అదే సమయంలో విచారణ చేసే అధికారుల జాబితాను సీఐడీ కోర్టుకు అందచేసింది. చంద్రబాబును విచారించే సమయంలో ప్రతీ గంట తరువాత అయిదు నిమిషాల (మిగతా 2లో)

## పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి: కలెక్టర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ డా ఎ మల్లికార్జున పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నియోజక వర్గాలకు చెందిన ఎన్నికల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ పై కలెక్టర్ సమీక్షించారు.

ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ కు సంబందించి ఏఈఓర్వో , ఈఆర్వో ల స్థాయిలో నియోజకవర్గాలలో సమావేశాలను నిర్వహించడం జరిగిందని, ఆ నివేదికలకు అనుగునంగా జిల్లాలో పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు.

జిల్లాలో ప్రస్తుతం ఉన్న 1945 పోలింగ్ కేంద్రాలకి అదనంగా 27 పోలింగ్ స్టేషన్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 212 పోలింగ్ కేంద్రాలలో లోకేషన్ మార్పిడి , 157 కేంద్రాలలో పేరు మార్పులు , 31 కేంద్రాల తొలగింపు చేసినట్లు తెలిపారు . రేషనలైజేషన్ ప్రక్రియ తరువాత మొత్తం 1941 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ సూచనలు ప్రకారం పోలింగ్ స్టేషన్లో ఉండవలసిన (మిగతా 2లో)

## పాడేరులో ఎస్టీ కమీషన్ సభ్యుల పర్యటన

**పాడేరు, (విశాఖ సమాచారమ్):** గిరిజన సంస్కృతి, భాషలు, సాంప్రదాయాలు పరిరక్షించాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు అనంత నాయక్ అన్నారు. శుక్రవారం పాడేరులో పర్యటించారు. ముందుగా మోద కొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయ లాంఛనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహిం తీర్థ ప్రసాదాలను అందజేసారు. అనంతరం పి. పి. ఎం. ఆర్.సి.భవనానికి చేరుకున్నారు. అక్కడ నుండి స్థానిక శ్రీకృష్ణా పురం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. కాఫీ, జిసిసి, వన్ధన్ వికాస కేంద్రం స్టాల్సు సందర్శించారు. జిల్లాలో కాఫీ సాగు, ఉత్పత్తి, గిరిజన రైతులు కాఫీ సాగులో పొందుతున్న ఆదాయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాఫీ, సాగు, జిసిసి సేవలు ఉత్పత్తులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మండలానికి చెందిన 113 వన్ వికాస కేంద్రాల



వివరించారు. పాడేరు మందికి 160 ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేసారు. ముందుగా 30 మందికి అటవీ హక్కుపత్రాలు పంపిణీ చేసారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు భరోసా వ్యవసాయ పెట్టుబడులు గురించి అధికారులు వివరించారు.

**పాఠశాల బాగుందా ఇంటి దగ్గర బాగుందా ?**

అనంతరం 10 వతరగతి విద్యార్థులతో ముచ్చటించారు. ఇంటి దగ్గర బాగుందా, పాఠశాలలో బాగుందని (మిగతా 2లో)

## కళాజాతల నిర్వహణకై కళాకారుల నుండి దరఖాస్తుల ఆహ్వానం

- దరఖాస్తు చేసుకోవడానికి చివరి గడువు అక్టోబర్ 10
- నక్సల్ ప్రభావిత ప్రాంతాలు,
- 50 శాతం మంది మహిళలు,
- ఎస్.సి, ఎస్.టి.లు ఉన్న కళాబృందాలకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు

**విజయవాడ, (పీఐబీ):** భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ తరుపున మూడు సంవత్సరాల పాటు కళాజాతాల నిర్వహణ కోసం వ్యక్తిగతంగా లేదా బృందాలుగా కళాకారుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ఆంధ్రప్రదేశ్ రీజియన్ జాయింట్ డైరక్టర్ పి.రత్నాకర్ ఓ ప్రకటనలో తెలిపారు.

పది మందికి పైగా కళాకారుల బృందం అయితే రెండువేల రూపాయలు, బృందంలో పది మంది లోపు ఉన్నట్టయితే కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే రిజిస్ట్రేషన్ ఫీజు మొత్తాన్ని డి.డి.గా " DDO, CBC, విశాఖపట్నం" పేరిట విశాఖపట్నంలో చెల్లుబాటు అయ్యే విధంగా చెల్లించవలసి ఉంటుందని ఆయన తెలిపారు. దరఖాస్తులను అక్టోబర్ పదవ తేదీ సాయంత్రం ఆరు గంటల లోపు అందే విధంగా "ది జాయింట్ డైరక్టర్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, కేంద్ర సమాచార-ప్రసార మంత్రిత్వ శాఖ, 2వ అంతస్తు, సి.జి.ఓ. కాంప్లెక్స్, ఆటోనగర్, విజయవాడ - 500007 (ఆంధ్రప్రదేశ్)" చిరునామాకు పంపాల్సి ఉంటుందని రత్నాకర్ తెలిపారు.

నక్సల్ ప్రభావిత శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి ప్రాంతాల కళాకారులకు రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఉంటుందని ఆయన తెలిపారు. అలాగే బృందంలో యాభై శాతం మంది మహిళలు (మహిళా బృందాలైనా), ఎస్.సి, ఎస్.టి. కళాకారులు ఉన్న వారికి కూడా రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఉందని, అవకాశాన్ని కళాకారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు www.davp.nic.in లేదా www.cbcindia.gov.in వెబ్ సైట్ లలో నోటిఫికేషన్ ను చూడవచ్చని రత్నాకర్ పేర్కొన్నారు.


## ఖైరతాబాద్ గణేష్ దర్శనం కోసం వచ్చిన మహిళల పట్ల పోకిరిల అసభ్య ప్రవర్తన

### 54 మందిపై కేసుల నమోదు



దేవాలయంలో భగవంతుడి సన్నిధికి భక్తితోనూ, పాఠశాలకు శ్రద్ధా సక్తుల తోనూ వెళ్ళమని మన పెద్దలు చెబుతారు. అయితే నేటి సమాజంలో వచ్చిన మార్పుల్లో భాగంగానే లేక వివిధ కారణాల వల్లనో.. చివరికి దైవం అంటే పాపపుణ్యం అనే భీతి లేదు.. చదువు చెప్పే గురువులకు తగిన గౌరవం లేదు. అందుకు ఉదాహరణగా ఎన్నో సంఘట నలు నిలుస్తునే ఉన్నాయి. ఓ వైపు చవితి వేడుకలను ఘనంగా జరుపు కుంటుంటే.. మండపాలను కొందరు ఆకతాయిలు వెకిలి వేషాలు వేసే వేదికగా మార్చుకుంటున్నారు. తాజాగా హైదరాబాద్ లోని ఖైరతాబాద్ మహా గణేషుడి మండపం వద్ద ఆకతాయిలు బరితెగించారు. భక్తుల ముసుగులో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. భక్తుల నుండి ఫిర్యాదులు అందడంతో ఆకతాయిలపై షీ టీమ్స్ నిఘా ఉంచాయి. మహిళల పట్ల వికృత చేష్టలకు పాల్పడుతున్న 54 మందిని షీ టీమ్స్ అరెస్ట్ చేశారు.. అరెస్ట్ అయిన వారిలో ఆటో డ్రైవర్లు, యువకులతో పాటు ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది.

ఖైరతాబాద్ గణేష్ ను దర్శించుకునేందుకు నిత్యం వేలాది భక్తులు వస్తుంటారు. ఇక శని, ఆదివారాలలో (మిగతా 2లో)



# ఆసుపత్రి పరిశుభ్రత పై వైద్య సిబ్బంది శ్రద్ధ వహించాలి

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మండలంలోని తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో రోగులకు అందుతున్న సేవల గురించి అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు అడిగి తెలుసుకున్నారు . అలాగే ఆసుపత్రి పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందికి ఆయన సూచించారు. ఆస్పత్రికి సంబంధించి సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు అధ్యక్షతన శుక్రవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించి



పలు అంశాలపై కార్యవర్గ సభ్యులు ఆసుపత్రి సిబ్బంది సర్పంచ్ ఎంపీటీసీ లతో చర్చించారు. ఈ సందర్భంగా హాస్పటల్ మొత్తంగా చెదల నివారణ నిమిత్తమ పేస్ట్ కంట్రోల్,

దోమల నివారణ నిమిత్తం మెస్ వర్క్ చేయుటకు, బయో మెడికల్ వేస్ట్ కవర్స్, గ్రిన్ క్లాత్ కొనుటకు, కంటెజెంట్ వర్కర్స్ జీతభత్యాలు ల్యాబ్ లో కప్ బోర్డు ఏర్పాటు చేయడం గురించి గ్యాస్ సిలిండర్ ,ఇన్వర్టర్ కొత్తది కొనుగోలు చేయుటకు, ఎమర్జెన్సీ ఎలక్ట్రికల్ , ప్లంబింగ్ ఎమర్జెన్సీ లైట్ కొనుగోలు చేయుటకు ఇతర అంశాలపై కార్యవర్గ సభ్యులు చైర్మన్ దృష్టి తీసుకొని వచ్చారు వాటిని త్వరలోనే పరిష్కారం అయ్యేలా చూస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మెంబర్లు డాక్టర్ జి.పావని, ఎంపీడీవో కె.వి నరసింహారావు, ఎమ్మార్వో పివిఎల్ఎం గంగాధర్, తగరంపూడి సర్పంచ్ యాదిగిరి అప్పారావు ,దిబ్బపాలెం సర్పంచ్ పీలా ఉషాఅప్పారావు ,డాక్టర్ జి పావని, మరియు వైస్ ఎంపీపీ ఆయితా ఆనంద రాము, తదితరులు పాల్గొన్నారు.

## పంచాంగం

శనివారం 23-09-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్షరుతువు
భాద్రపద మాసం

**తిథి : శు. అష్టమి ఉ. 07.36**
**నక్షత్రం : నవమి తె. 04.31 త. మూల**
**వర్జ్యం : రా. 08.39 ల 10.09**

# (మొదటి పేజీ తరువాయిలు)

## చంద్రబాబు నాయుడుకు రెండురోజుల సీఐడీ కస్టడీ

చొప్పున విరామం ఇవ్వాలని కోర్టు సూచించింది. అంతకు ముందు చంద్రబాబును వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా విచారణ చేసిన న్యాయమూర్తి జైలులో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ప్రశ్నించారు. ఎటువంటి ఇబ్బంది ఉన్న తనకు చెప్పాలని సూచించారు.

ఇక, హైకోర్టులో క్వాష్ పిటీషన్ డిస్మిస్ అయిన తరువాత సీఐడీ కస్టడీకి న్యాయమూర్తి అనుమతి ఇచ్చారు. వచ్చే సోమవారంతో చంద్రబాబు సీఐడీ కస్టడీతో పాటుగా రిమాండ్ సమయం ముగించనుంది.క్వాష్ పిటీషన్ హైకోర్టులో డిస్మిస్ కావటంతో చంద్రబాబు తరుపు న్యాయవాదులు ఏసీబీ కోర్టులో పెండింగ్ లో ఉన్న బెయిల్ పిటీషన్ విచారణ చేయాలని కోరారు. అయితే, సీఐడీ కస్టడీకి ఇచ్చిన సమయంలో విచారణ సరి కాదని పేర్కొన్న న్యాయస్థానం.. సోమవారం విచారించేందుకు అంగీకరించింది. దీంతో, సోమవారం చంద్రబాబు బెయిల్ రిమాండ్ పొడిగింపు పైనా స్పష్టత రానుంది.

## పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి: కలెక్టర్

మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బిల్డింగ్ పాడైన చోట , సౌకర్యాలు లేని చోట లొకేషన్ మార్పులు చేసినట్లు తెలిపారు. రెండు కిలోమీటర్ల దూరం మించితే కొత్త కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొన్ని కేంద్రాలలో పేరు మార్పులు చేశామని తెలియజేసారు.

ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకు ఒక్కో పోలింగ్ స్టేషన్ కి 1500 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉండకుండా, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అర్బన్ పరిధిలో ఒకే చోట ఎక్కువ పోలింగ్ కేంద్రాలు లేకుండా ఉండేటట్లు మార్పులు చేశామని అన్నారు. అక్టోబర్ 17 న డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ పబ్లికేషన్ జరుగుతుందని చెప్పారు.

ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె మోహన్ కుమార్ , భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి, వై.ఎస్.ఆర్ సి పి , టిడిపి, బిజెపి, కాంగ్రెస్ , బి ఎస్ పి , సిపిఎం, ఆప్ ఇతర పార్టీ ప్రతి నిధులు, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

## పాడేరులో ఎస్టీ కమీషన్ సభ్యుల పర్యటన

విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీని అధికారులు వివరించారు. వ్యవసాయ పనుల్లో తలిదండ్రులకు సాయం చేస్తారా, చేస్తామని విద్యార్థులు ఒరియా భాషలో వివరించారు. జలియన్ వాలా బాగ్ సంఘటన గురించి ప్రశించారు. భారత స్వాతంత్ర పోరాటంలో 1000 గోండు గిరిజనులు ప్రాణాలను అర్పించారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింత్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడి ఏ పి ఓ వి. అభిషేక్, గిరిజన సంక్షేమశాఖ డిడి ఐ. కొండలరావు, ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి. ఎస్. ప్రభాకరరావు, ఎం. వేంకటేశ్వరరావు, టిసి ఆర్ టి ఎం అధికారి జి. చినబాబు, ఎస్టీ కమిషన్ అధికారులు పి.కె. పరీడా, జయంత్ జె. సరోడే, రాధాకాంత త్రిపాఠి, ఆర్. ఎస్. మిశ్రా, కురసా ఉమా మహేశ్వరరావు, పాంగి రాజారావు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు లిల్లీ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక గురుకుల కళాశాల ప్రాంగణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. గిరిజన విద్యార్థులతో కమిషన్ సభ్యులు అనంత నాయక్, జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో థింసా డాన్స్ చేశారు.

## ఖైరతాబాద్ గణేష్ దర్శనం కోసం వచ్చిన మహిళల పట్ల పోకిరిల అసభ్య ప్రవర్తన

అయితే భక్తులు పోటెత్తుతారు. లక్షల్లో భక్తులు గణపయ్యను దర్శనం చేసుకుంటారు. చిన్న పిల్లలు, పెద్ద వాళ్ళు అని తేడా లేకుండా ఎంత కష్టం ఉన్న సరే క్యూ లైన్స్ లో నిలబడి తమ కోరికలు స్వామి వారికి విన్నవించుకుంటారు. తమ మొక్కులు చెల్లించుకుంటారు. ఇలా నిత్యం లక్షలాది భక్తులతో ఖైరతాబాద్ గణేష్ వద్ద సందడి వాతావరణం నెలకొంటుంది. అన్ని శాఖల సమన్వయం తో ఏర్పాట్లు చేసిన అధికారులు.. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారి పై ప్రత్యేకంగా దృష్టి సారించింది.

వినాయక చవితి రోజు నుంచే ఖైరతాబాద్ లో కొలువైన గణపయ్యను దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు వస్తూనే ఉన్నారు. నిత్యం భక్తుల తాకిడి పెరుగుతూ ఉండడంతో ఇదే అదునుగా భావించిన ఆకతాయులు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు కొందరు మహిళలు. మఫ్టీ లో పోలీసులు ఉన్నా ఏ మాత్రం భయం లేకుండా ఆకతాయిలు విచ్చల విడిగా రెచ్చిపోతున్నారు. ఇప్పటికి 54 మంది పోకిరీలను షి టీమ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఆటో డ్రైవర్లు తో సహా ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఉన్నారు. వరుస ఫిర్యాదులతో ఖైరతాబాద్ గణేష్ వద్ద మరింత కట్టుదిట్టం చేశారు పోలీసులు. అత్యవసరం అయితే డైల్ 100 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలి అని కోరారు. ఖైరతాబాద్ గణేష్ దర్శనం ముసుగులో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తప్పవు అని పోలీసులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# ఆర్ఐఎన్ఎల్‌లో వైభవంగా ముగిసిన క్వాలిటీ కాన్సెప్ట్ లపై చాప్టర్ కన్వెన్షన్ 2023

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా, విశాఖపట్నం చాప్టర్ 2023 సెప్టెంబర్ 21 మరియు 22 తేదీల్లో ఉక్కునగరంలో క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా, "బెటర్ ఫ్యూచర్ కోసం నాణ్యమైన భావనలను పెంపొందించుకోండి" అనే థీమ్‌తో క్వాలిటీ కాన్సెప్ట్‌లపై నిర్వహించిన 2-రోజుల చాప్టర్ కన్వెన్షన్ 2023 ఈ రోజు విజయవంతంగా జరిగింది.

33 సంస్థల నుండి దాదాపు 653 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని, క్వాలిటీ సర్కిల్‌లు, లీన్ క్వాలిటీ సర్కిల్‌లు, 5ఎస్ వర్క్‌ప్లేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, కైజెన్, సిక్స్ సిగ్మా మరియు లీన్ సిక్స్ సిగ్మా కాన్సెప్ట్‌లపై 134 కేస్ స్టడీలను సమర్పించారు.

ఈరోజు ఆర్ఐఎన్ఎల్‌కు చెందిన ఉక్కునగరం క్లబ్ మల్టీపర్పస్ హాల్‌లో ఏర్పాటు చేసిన ముగింపు వేడుకలకు విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ రియర్ అడ్మిరల్ ఆర్.విజయ్ శేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా రియర్ అడ్మిరల్ ఆర్.విజయ్ శేఖర్ మాట్లాడుతూ.. ఉద్యోగి ప్రమేయమే కార్యక్షేత్రంలో విజయానికి కీలకమని అన్నారు. ఆర్ఐఎన్ఎల్‌లో క్వాలిటీ సర్కిల్‌లు మరియు 5ఎస్ వర్క్‌ప్లేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి ఉద్యోగుల ప్రమేయం మరియు నిరంతర మెరుగుదల కార్యక్రమాలకు సంస్థలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నందుకు ఆయన విశాఖ ఉక్కు కర్మాగారం యావత్ సిబ్బందిని ప్రశంసించారు. క్యూసీఎఫ్ఐ విశాఖపట్నం చాప్టర్ కన్వెన్షన్‌ను నిర్వహించిన తీరును ఆయన అభినందించారు. ఈ ప్రాంతంలోని సభ్య సంస్థలలో నాణ్యమైన భావనలను ప్రచారం చేసినందుకు విశాఖపట్నం చాప్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు, తద్వారా సంబంధిత సంస్థల్లోని క్వాలిటీ సర్కిల్‌లు, 5ఎస్ మొదలైన చిన్న గ్రూప్ కార్యకలాపాలను ఉపయోగించి ఖర్చును తగ్గించడం మరియు ఉత్పాదకతను మెరుగుపరచడం వంటి నిరంతర మెరుగుదలలను ప్రారంభించింది. వారి కేస్ స్టడీస్‌ను సమర్పించి, తమ కార్యాలయంలోని సమస్యలకు వినూత్న పరిష్కారాలను అందించి, వారి సంబంధిత సంస్థలకు ప్రశంసలు తెచ్చిపెట్టినందుకు గోల్డ్ మరియు సిల్వర్ అవార్డులను గెలుచుకున్న ప్రతినిధులను ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా విశాఖపట్నంలోని ఎల్అండ్‌టి డిఫెన్స్, సైట్ హెడ్ జనరల్ మేనేజర్ అతుల్ కుమార్ శ్రీవాస్తవ, విశాఖపట్నంలోని యోకోహామా ఆఫ్-హైవే టైర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ బి.ప్రహ్లాద్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న గ్రూపు కార్యకలాపాలు సంస్థలకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఉద్యోగులు చురుకుగా పాల్గొనడం మరియు జ్ఞానాన్ని వ్యాప్తి చేయడంలో మరియు పరిసర సంస్థలను అధిక నాణ్యత మరియు ఉత్పాదకత వైపు నడిపించడంలో క్యుసిఎఫ్ఐ విశాఖపట్నం యొక్క ప్రయత్నాలను వారు ప్రశంసించారు.

జి గాంధీ, సిజిఎం (హెచ్‌ఆర్) ఆర్ఐఎన్ఎల్ మరియు క్యుసిఎఫ్ఐ విశాఖపట్నం చాప్టర్ చైర్మన్ తమ ప్రతినిధులను నామినేట్ చేసినందుకు పాల్గొన్న అన్ని సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. సదస్సు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో బంగారు, రజత అవార్డులు, వివిధ బహుమతులు గెలుచుకున్న జట్లను ఆయన అభినందించారు.

వైస్ చైర్మన్, క్యుసిఎఫ్ఐ సిఎండిఇ సంజయ్ కుమార్, జీఎం నేవల్ డాక్‌యార్డ్ విశాఖపట్నం వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న అన్ని సంస్థలకు మరియు బృందాలు చురుకుగా పాల్గొన్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

మోడల్ ఎగ్జిబిషన్, కల్చరల్ ఈవెంట్‌లు, నాలెడ్జ్ టెస్ట్, క్విజ్, పోస్టర్, పద్యాలు, వ్యాసం, నినాదం వంటి వివిధ ఈవెంట్‌లలో విజేతలకు ఎన్‌వి స్వామి, సిజిఎం(వర్క్స్)-ఇంఛార్జి



ఆర్ఐఎన్ఎల్ మరియు శ్రీ యు శ్రీధర్, సిజిఎం(మెయింటెనెన్స్ ,మిల్స్) ఆర్ఐఎన్ఎల్ బహుమతులు అందజేశారు.

శ్రీ ఎన్‌వి స్వామి, సిజిఎం(వర్క్స్)-ఇంఛార్జి ఆర్ఐఎన్ఎల్ మరియు జి.గాంధీ, సిజిఎం (హెచ్‌ఆర్) ఆర్ఐఎన్ఎల్ మరియు క్యుసిఎఫ్ఐ విశాఖపట్నం చాప్టర్ ఛైర్మన్ ఆర్ఐఎన్ఎల్ ద్వారా చేపట్టిన "స్వచ్ఛతా హీ సేవ" ప్రచారంలో భాగంగా పాల్గొన్న వారందరితో కలిసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు.

గౌరవ కార్యదర్శి క్యూసిఎఫ్ఐ విశాఖపట్నం చాప్టర్ ఎంఈసీవీ సాగర్ ఈ సంవత్సరం గరిష్ట సంఖ్యలో ప్రతినిధులను నామినేట్ చేయడం ద్వారా సిసిక్యూసి 2023 యొక్క ఈ మెగా ఈవెంట్‌ను గ్రాండ్‌గా విజయవంతం చేసినందుకు అన్ని సభ్య సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్‌వివిఎస్ రఘు రామ రాజు, జాయింట్ సెక్రటరీ మరియు డిజిఎం(హెచ్‌ఆర్) Teejay India Pvt Limited, వోట్ అఫ్ థాంక్స్ ప్రతిపాదించారు.

# ముగ్గు

మన పూర్వీకులు ముగ్గు ఎందుకు పెట్టేవారు? ఆ ముగ్గుల అర్థం పరమార్థం ఏంటి? అనేది తెలుసుకుందాం.

ఇంటి గడప ముందు ముగ్గులో భాగంగా గీసే రెండు అడ్డగీతలు ఇంటి లోనికి దుష్టశక్తులను రాకుండా నిరోధి స్తాయి. ఇంట్లో ఉన్న లక్ష్మీదేవి బయటకు వెళ్ళ కుండా చూస్తాయి.

ముగ్గు వేసి దానికి నాలుగు వైపులా రెండేసి అడ్డగీతలు గీస్తే అక్కడ శుభ కార్యాలు, మంగళకరమైన పనులు జరుగుతున్నాయని గుర్తు. పండుగల సమయంలో ఈ విధంగా ఖచ్చితంగా వేయాలి.

ఏ దేవత పూజ చేస్తున్నా దైవాన్ని ఉంచే పీట మీద మధ్యలో చిన్న ముగ్గు వేసినా నాలుగు వైపులా రెండేసి గీతలను తప్పక గీయాలి.

నక్షత్రం ఆకారం వచ్చేలా గీతలతో వేసిన ముగ్గు భూత, ప్రేత, పిశాచాలను ఆ దరిదాపులకు రాకుండా చూస్తుంది. అంతే



కాదు, మనం వేసే పద్మాలు, చుక్కల ముగ్గులలో కూడా మనకు తెలీని అనేక కోణాలు దాగి ఉన్నాయి. అవి కేవలం గీతలే కాదు, యంత్రాలు కూడా. యంత్ర, తంత్ర శాస్త్ర రహస్యాలతో కూడి ఉండడం వలన మనకు హాని కలిగించే చెడ్డశక్తులను దరిచేరనీయవు. అందుకే ఏ ముగ్గునైనా తొక్కకూడదు.

తులసి మొక్క దగ్గర అష్టదళపద్మం వేసి దీపారాధాన చేయాలి.

యజ్ఞ, యాగాదులలో యజ్ఞ గుండం మీద నాలుగు గీతలతో కూడిన ముగ్గులేయాలి. దైవ కార్యలలో కూడా నాలుగు గీతలతో కూడిన ముగ్గులు వేయాలి.

నూతన వధూవరులు తొలిసారి భోజనం చేసే సమయంలో వారి చుట్టు ప్రక్కల లతలు, పుష్పాలు, తీగలతో కూడిన ముగ్గులు వేయాలి.

దేవతా రూపాలను, ఓం, స్వస్తిక్, శ్రీ గుర్తులను పోలిన ముగ్గులు వేయ కూడదు. ఒకవేళ వేసినా వాటిని తొక్కకూడదు.

ఏ స్త్రీ అయితే దేవాలయంలోనూ, అమ్మవారు, శ్రీ మహావిష్ణువు ముందు నిత్యం ముగ్గులు వేస్తుందో, ఆస్త్రీకి ఏడు జన్మలవరకు వైధవ్యం రాదని, మరియు సుమంగళిగానే మరణిస్తుందని దేవీ భాగవతం, బ్రహ్మాండపురాణం చెబుతున్నాయి.

పండుగ వచ్చింది కదా అని, నడవ డానికి చోటు లేకుండా వాకిలంతా ముగ్గులు పెట్టకూడదు.

ఇప్పుడు ముగ్గులు రోజు వేయలేక పెయింట్ పెట్టేస్తున్నారు. దాన్ని ముగ్గుగా శాస్త్రం అంగీకరించదు. ఏ రోజు కా రోజు బియ్యపు పిండితో ముగ్గు పెట్టాలి.

నిత్యం ఇంటి ముందు, వెనుక భాగంలో, తులసి మొక్క దగ్గర దీపా రాధన చేసే ప్రదేశంలో ముగ్గు వేయాలి.

ముగ్గు పాజిటివ్/దైవ శక్తులను ఇంట్లోకి ఆకర్షిస్తుంది.

ముగ్గులు శుభ సూచకాలుగా పని చేస్తాయి.

పూర్వం రోజులలో సాధువులు, సన్యాసులు బ్రహ్మచారులు ఇల్లిల్లూ తిరిగి బిక్ష అడిగే వారు. ఏ ఇంటిముందైనా ముగ్గు లేదంటే ఆ ఇంటికి వెళ్ళేవారు కాదు. వారే కాదు భిక్షకులు కూడా ముగ్గులేని ఇళ్ళకు వెళ్ళి అడ్డుక్కునే వారు కాదు.

ఇంటి ముందు ముగ్గు లేదంటే అక్కడ అశుభం జరిగిందని గుర్తు. అందుకే మరణించినవారికి శ్రాద్ధకర్మలు చేసే రోజున ఉదయం ఇంటిముందు ముగ్గువేయరు. శ్రాద్ధకర్మ పూర్తైన వెంటనే, అది మధ్యాహ్నమైనా ముగ్గు వేస్తారు.

ముగ్గులు వెనుక సామాజిక, మానసిక, ఆరోగ్య, అధ్యాత్మికమైన అనేక రహస్య కోణాలు దాగి ఉన్నాయి. మనం ఆచరించే ఏ ఆచారమూ మూఢనమ్మకం కాదు. మన ఆచార, సంప్రదాయాలన్నీ అనేకా నేక అర్థాలు, పరమార్థాలతో కూడినవి.

# కేంద్ర ఉక్కు కార్యదర్శి నాగేంద్రనాథ్ సిన్హాకు ఉక్కు కార్మికులతో కలిసి విజ్ఞప్తి చేసిన జీవీఎల్

(మొదటి పేజీ తరువాయిలు)

ఎంపీ జీవీఎల్ స్టీల్ సెక్రటరీకి తెలియజేశారు.

ఛత్తీసగఢ్‌లోని నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండిసి)కి చెందిన బచేలి, కిరండోల్ ఇనుప ఖనిజం గనుల నుంచి ఇనుప ఖనిజం సరఫరా చేయాలన్న అంశాన్ని కూడా ఎంపీ జీవీఎల్ చర్చించారు. సమావేశంలో, ఎంపీ జీవీఎల్ ఆర్ఐఎన్ఎల్ యొక్క కఠిన ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడానికి మార్గాల గురించి మరియు ఉద్యోగుల ప్రయోజనాల గురించి కూడా విపులంగా చర్చించారు.

ఇటీవల విశాఖపట్నంలోని ఆర్ఐఎన్ఎల్‌ను సందర్శించిన ఉక్కు శాఖ కార్యదర్శి అన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించారని, ఆర్ఐఎన్ఎల్ మరియు దాని ఉద్యోగులకు మద్దతుగా హామీ ఇచ్చారని ఎంపీ జీవీఎల్ నరసింహారావు సమావేశ అనంతరం ఆశాభావం వ్యక్తం చేసారు.



# విశాఖ సమాచారమ్

శనివారం 23-09-2023


## పి.బి.శ్రీనివాస్ "సహభాష్ కోకనాడ"

పి.బి.శ్రీనివాస్ ఎప్పుడేనా "సహభాష్ కోకనాడ" అనే కవి పేరు విన్నారా ? అది ఆయన అసలు పేరు కాదు.. కలం పేరు!

ఆ కవికి ఆ కలం పేరు ఉందని తెలిసిన వారు బహు కొద్దిమందేనేమో! ఎనిమిది భాషలలో ఆ కవి రెండు లక్షల యాభై వేలకు పైగా వచన, గద్య, పద్య, కవితా రచనలు చేశారు. ఆయన పన్నెండు భాషలలో అనర్గళంగా మాట్లాడగల సమర్థుడు . అందునా ఒక తెలుగు వాడు. ఆయన సొంత ఊరైన కాకినాడని తన కలంపేరుగా పెట్టుకొన్న మహా మనిషి, అమరగాయకుడు ఆయనే " ప్రతివాద భయంకర శ్రీనివాస్" .... అందరికి సుపరిచయం.. "పి.బి. శ్రీనివాస్" అనే! ఈ రోజు వారి జయంతి. తూర్పు గోదావరి జిల్లా కాకినాడ కు చెందిన పి. బి. శ్రీనివాస్ తన గానమాధుర్యాన్ని పంచి, తమిళనాడు ప్రభుత్వం నుండి 'కలైమామణిబీ పురస్కారాన్ని, కర్ణాటక ప్రభుత్వ పురస్కారాన్ని, శ్రీ రాఘవేంద్ర మఠం వారి ప్రతిష్ఠాత్మకమైన 'సంగీత కళానిధి' పురస్కారాన్ని, కంచి జగద్గురుపీఠం శ్రీ జయేంద్రసరస్వతుల నుంచి 'సంగీతరత్న', 'సంగీత నాథమణి' బిరుదాలను స్వీకరించారు. ఆరిజోనా విశ్వవిద్యాలయం నుంచి సంగీత సాహిత్యాలకు అందించిన సేవలకు గాను 'డాక్టరేట్' గౌరవాన్ని కూడా అందుకొన్నారు. (ఆయనకు మన తెలుగు వారు ఏ బిరుదులూ ఇవ్వక వారి గొప్పదనం చాటుకున్నారు). హిందీ, ఇంగ్లీష్, తమిళ్, మళయాళం, ఉర్దు, తుళు, కొంకణీ, కన్నడ, సంస్కృతం ఇలా చాలా భాషల్లో ఆయన నిష్ణాతులు. ఉర్దూ కవితలు రాసినప్పుడు 'సహభాష్ కోకనాడీ అనే పేరుతో రాసేవారు. ఆయన హిందీ, ఇంగ్లీష్, తమిళ్, మళయాళం, ఉర్దు, తుళు, కొంకణీ, కన్నడలో 3000 లకు పైగా పాటలు పాడారు. అకలి రాజ్యం సినిమాలో 'తూ హై రాజా మై హూ రాణి' అనే హింది పాట వ్రాసింది పి.బి. శ్రీనివాస్ గారే! ఒకసారి కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు పి.బి. శ్రీనివాస్ గారి పాట విని ఆయన కుమారుడైన పావన శాస్త్రి గారితో "ఈ పాట పాడిందెవరూ?" అని అడిగారుట. "పి.బి. శ్రీనివాస్ అదే ప్రతివాద భయంకర శ్రీనివాస్ అని... " అని ఆయన కుమారుడు జావాబివ్వగా "మగటిమి ఉన్న గాత్రం .. భలే ఉంది" అని అన్నారుట ఆ గంభీర గాత్రాన్ని విని. 'డైమండ్ టి' అనే ప్రక్రియతో ఒక మేలకర్త రాగానికి ఆరోహణ, అవరోహణలు చెబుతూ ఆ రాగాన్ని సులువుగా గుర్తుపెట్టుకోగల నైపుణ్యాన్ని ఎందరో విద్యార్థులకు భోధించారు పి.బి. శ్రీనివాస్. అలా 72 మేళకర్త రాగాలను సులువుగా గుర్తించ గల ప్రక్రియ కనిపెట్టింది వారే! ఆయన కొన్ని రాగాలను సృష్టించారు కూడా! ఆ రాగాలకు సాహిత్యం కూడా వారేరాసుకునేవారు. ఆయన మన సమకాలికులైన వాగ్గేయకారుడు. వారు ఎక్కడకు వెళ్ళినా ఆయన కారు నిండా పుస్తకాలతో నిండీ ఉంటుంది. వారు ఏ సభలకు వెళ్ళినా ఒక చంటి పిల్లాడిని చేతిలో ఎత్తుకున్నట్టు ఆయన చేతిలో ఎప్పుడూ కనీసంలో కనీసం నాలుగైదు పుస్తకాలు ఉండేవి. ఆయన జీవితంలో పుస్తకాలకి అంతటి స్థానం ఉందన్న మాట! వారి దగ్గర ఎక్కువ పుస్తకాలే కాదు, ఎక్కువ పెన్నులు కూడా ఎప్పుడూ ఉంటాయి. ఆయన దగ్గర ఉన్న 'ఫౌంటేన్ పెన్నులు' మరే రచయిత దగ్గరా లేవేమో! ఆయన ఎక్కువగా రాసుకునే చోటు 'వుడ్లాండ్స్'(డ్రైవ్ ఇన్) . అక్కడ వారికోసం ఒక బెంచి, కుర్చీ ఆ 'వుడ్ లాండ్స్' వారు ప్రత్యేకంగా ఉంచేవారుట. ఒకసారి భువనచంద్రగారు "ఇంత వరకు మీరు కన్నడలో రాజ్ కుమార్ గారికి ఎక్కువ పాటలు పాడారు కదా? ఇప్పుడు ఆయన పాటలు ఆయనే పాడుకుంటున్నారు, దాని మీద మీ స్పందన ఏంటీ?" అని అడుగగా..."అంత గొప్ప గాయకుడు ఏమాత్రమూ అతిశయోక్తి లేకుండా నాచేత పాడించుకోవడం నా అదృష్టం" అని చేతులు పైకెత్తి నమస్కరిస్తూ అన్నారు.


**పబ్లిక్ నోటీసు**

**ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్..**

(ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ యొక్క అనుబంధ సంస్థ)

రి.నెం. ABC-CS/006/2015

HO: ABCCS Endowments Commissionerate Complex, Gollapudi, Vijayawada-521225, Phone: 0866-6650307.

BO: ABC-CS, Flat No.F1, HSR Enclave, Opp Andhra Bank, Akkayyapalem, Visakhapatnam-530016, Ph : 0891-2561655

ఈ ప్రకటనలోని వారి తాలుకు దిగువ ఉదహరించిన స్థిరాస్థిని సొసైటీ నందు తనఖా పెట్టి అప్పు పొదుటకు దరఖాస్తు చేసియున్నారు. సదరు స్థిరాస్థి తనఖా పై, సొసైటీ వారు మంజూరు చేయబోవు అప్పు విషయమై ఎవరికైనను ఎట్టి అభ్యంతరములు ఉన్న ఎడల ఈ ప్రకటన తేది నుండి 7 రోజులలోపుగా లిఖిత పూర్వకముగా అభ్యంతరములను రిజిస్టర్ పోస్ట్ విత్ ఏక్ నాలెడ్జ్ మెంట్ ద్వారా మా సొసైటీకు తెలియ పరచవలసిన కోరుతున్నాము.

| Sl.No. | Applicant Name & Present Residence Address | Description of the property |
|---|---|---|
| 1. | Sri. Meduri Nageswara Rao, Appl No. 88946 S/o. (Late) Sri. Meduri Satyanarayana Cell: 9533068112/ 9177355042 | The properity in an extent of 166.94 Sq. Yards, of house site along with RCC roofed ground and first floor residencial building therein, in RS No. 21/12 B & 12C, Patta Nos. 80 & 129, Door no: 26-6-78, Revenue ward no, 26, Asst no. 1087025126, Konda koppaka (V), Opp SS Builders, Main Road, Anakapalli (M), Anakapalli District - 531001 Value Rs. 52.03 Lakhs |
| Visakhapatnam 21/09/2023 | | Branch Manager, SRINIVASA RAO TATA 9281029463/9848141269 |


## డైట్‌లో ఘనంగా ఫారడే జయంతి వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ లో ఈ రోజు ఇ ఇ ఇ డిపార్ట్మెంట్ డే ఫారడే మెమోరియల్ డే ఘనం గా జరిగినది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ . శ్రీను నాయక్ విచ్చేసి విద్యార్థుల పరిశోధనలకు నిదర్శనంగా " ఇన్నోవేటివ్ ఐడియాస్ -2 కె 23 " పుస్తకాన్ని విడుదల చేశారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి సాంకేతిక విషయాలపై ఉపన్యసించారు .ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ప్రిన్సిపాల్ ఆర్ వైకుంఠరావు మరియు ఇ ఇ ఇ విభాగాధిపతి డాక్టర్ ఏ ఎస్ ఎల్ కె గోపాలమ్మ ,ఇతర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు . సాంకేతిక పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## రాజ్యాంగంలో పొంది పరిచిన గిరిజన హక్కుల ను పరిరక్షిస్తా




**పాడేరు, (విశాఖ సమాచారమ్):** రాజ్యాంగంలో పొందిపరిచిన గిరిజన హక్కులను పరిరక్షించి, గిరిజనులకు సత్వర న్యాయం చేయడానికి జాతీయ ఎస్టీ కమిషన్ ఏర్పడిందని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు అనంత నాయక్ స్పష్టం చేసారు. ఆయన రెండు రోజుల పట్యనలో భాగంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో వివిద గిరిజన సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన హిందీలో మాట్లాడుతుంటే జిల్లా కలెక్టర్ తెలుగులోకి అనువదించారు. స్థానిక నేతలు తెలుగులో మాట్లాడితే హిందీ లోకి అనువదించి కమీషన్ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎస్టీ కమీషన్ సభ్యులు మాట్లాడుతూ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించాలని సూచించారు. నిర్థిష్టమైన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కమీషన్ పరిస్కరిస్తుందన్నారు. గిరిజన సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు చెప్పిన సమస్యలను విన్నారు. దేశంలో ఎన్నో రకాల కేసులు ఉన్నాయన్నారు. కేసులు పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ రూ.183 కోట్లతో పెట్రలో బంకులు ఏర్పాటు చేయడానికి సిద్దంగా ఉందని గిరిజనులు బంకులు ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని చెప్పారు.

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లడుతూ నిజమైన ఫిర్యాదులు వస్తే తప్పకుండా విచారణ చేపట్టి తగిన చర్లు తీసుకుంటామని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఆదివాసీ జె ఎసి జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ఉపకలెక్టర్ కార్యాలయాన్ని బలోపేతం చేయాలని కోరారు. పరిపాలనా యంత్రాంగం ఏజెన్సీ చట్టాలకు లోబడి పనిచేయాలన్నారు. రాష్ట్ర గిరిజన ఉపాధ్యాయ సంఘం జి. ఓ నెం.3ని సుప్రీం కోర్టు కొట్టేసిందని దాని వలన గిరిజన ఉద్యోగులకు పదోన్నతులలో నష్టం వాటిల్లుతుందన్నారు. అల్లూరి సీతా రామ రాజు జిల్లా గిరిజన ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యక్షుడు నీల కంఠం మాట్లాడుతూ షెడ్యూలు 5లో భారత రాజ్యాంగ కల్పించిన హక్కులను కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మఖిసేషాద్రి మాట్లాడుతూ అల్లూరి సీత రామ రాజు జిల్లాను జోన్ 1 లోనే కొన సాగించాలని కోరారు. అనంతరం గిరిజన సంఘాల నేతల నుండి ఫిర్యాదులు స్వకరించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటిడి ఏ పిఓ వి. అభిషేక్, అదనపు ఎస్పీ పి.అనిల్, కేంద్ర కాఫీ బోర్డు సభ్యులు కురుసా ఉమామహేశ్వరరావు, కమిషన్ అధికారులు, వివిద గిరిజన సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు

## నేను ఆత్మహత్య చేసుకుంటే ఆ ఇద్దరిదే బాధ్యత




'తనను గెలిపించన ప్రజలకు ఏమీ చేయలేకపోతున్నా, వాళ్ళముందు దోషిగా నిలబడలేక, క్షణికావేశంలో ఏమైనా చేసుకుంటా, అప్పుడు దానికి బాధ్యత మీరే వహించాలి. తన వార్డు నిర్లక్ష్యానికి గురవుతోందని, కేవలం ప్రతిపక్ష పార్టీ కార్పొరేటర్ కావడం వల్లే అని నేను నమ్ముతున్నాను. వార్డ్ ప్రజల సమస్యలను తాను పరిష్కరించ లేకపోతున్నాను ఒక్కోసారి ఏమైనా చేసుకోవాలని అనిపిస్తోంది' ఇది గ్రేటర్ విశాఖకు చెందిన ఒక కార్పొరేటర్ ఎమోషన్. గ్రేటర్ విశాఖ మునిసిపల్ కార్పొరేషన్ లోని 79 వ వార్డు టిడిపి కార్పొరేటర్‌గా ఉన్న రౌతు శ్రీనివాసరావు ఆవేదన ఇది. తాను కార్పొరేటర్‌గా ఎంపికై మూడున్నరేళ్లు దాటినా తన వార్డులో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు రౌతు శ్రీనివాసరావు. చివరకు కనీసం వీధి లైట్లు వేయకపోవడం వల్ల తన వార్డు చీకట్లో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

**తన వార్డు లో 500 లైట్లు వెలగడం లేదు..**

తాను గెలుపొందిన 79 వార్డు పూర్తి గా గ్రామీణ నేపథ్యం ఉన్న ప్రాంతం అని అందులో విద్యుత్ లేకపోతే చీకటి గా ఉంటుందని వాపోయారు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు. ముఖ్యంగా శివాజీ నగర్, గొల్లవాని పాలెం, ఓల్డ్ అగనం పూడి, శాంతి నగర్ సత్రం, శ్రీనివాస నగర్, అన్నపూర్ణ నగర్, కే ఎస్ ఎన్ రెడ్డి నగర్, శనివాడ, లంకెలపాలెం, కరణం వారి వీధి, బీ సీ కాలనీ, దాసరి వీధి, ఎస్ సీ కాలనీ, కొండ వీధి, శ్రీరంగ నాయకుల కాలనీ, అప్పికొండ వారి వీధి, పూజారి వారి వీధి , గొల్ల పేట, లంకెలపాలం ఇండస్ట్రీస్, జాజులవాని పాలెం, అత్తవాని పాలెం, కొండాయ వలస లాంటి ప్రాంతాలలో దాదాపు 500 బల్బులు వెలగడం లేదని, తాను స్వయంగా ప్రతీ స్థంభం వద్దకు వెళ్ళి నోట్ చేసుకుని కమిషనర్ కు ఇచ్చానని, అయినా పట్టించుకోలేదన్నారు రౌతు శ్రీనివాసరావు. అలాగే మరో 190 చోట్ల కొత్త బల్బులు కావాలని కూడా కోరానని అసలు స్పందనే లేదన్నది రౌతు శ్రీనివాసరావు ఆవేదన. దీంతో వార్డు లో తిరుగుతున్నప్పుడు ప్రజలు నన్ను దోషిగా చూస్తున్నారనీ, టీడీపీ కార్పొరేటర్ ను కాబట్టే వివక్ష చూపుతున్నారని ఆరోపించారు రౌతు శ్రీనివాసరావు.

**అధికార పార్టీ కార్పొరేటర్లదీ అదే ఆవేదన..**

టిడిపి కార్పొరేటర్ కాబట్టి తన పట్ల వివక్ష చూపిస్తూ అభివృద్ధి చేయడం లేదని, తన వార్డులో కనీసం వీధిలైట్లు కూడా వేయకపోవడం వల్ల రాత్రిపూట చీకటి మయంగా మారుతుందన్న ఆవేదన తో కూడిన వీడియోని రౌతు శ్రీనివాసరావు జీవీఎంసీ వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేశారు. అయితే ఆవేదన తో కూడిన ఆయన వీడియో చూసిన తోటి కార్పొరేటర్లు పార్టీలకు అతీతంగా స్పందించారు. ఇది కేవలం మీ ఒక్కరి సమస్య కాదంటూ అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు కూడా గళం కలిపారు.

# ఈ ఫుడ్ కాంబినేషన్స్ తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం



ఆరోగ్యంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. సాధారణంగా, ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి అనేక రకాల ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను వారి ఆహారంలో భాగంగా చేసుకుంటారు. అయితే మీరు ఈ ఆహారాలను ఎలా తింటారు అనేది కూడా అంతే ముఖ్యం. నిజానికి, చాలా సార్లు మనం కొన్ని ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను కలిసి తీసుకుంటాం.

అయితే, ఈ ఆహార కలయికల కారణంగా, ఆరోగ్యం ప్రయోజనాలకు బదులుగా నష్టాన్ని చవిచూడవచ్చు. కాబట్టి, ఈరోజు ఈ ఆర్టికల్‌లో మనం ఆరోగ్యానికి మంచివిగా భావించని కొన్ని ఆహార కలయికల గురించి మీకు ఇక్కడ తెలియజేస్తున్నాము-

**భోజనంతో పండు తినడం:** కొంతమంది తమ భోజనంతో పాటు పండ్లను తినడానికి ఇష్టపడతారు లేదా పండ్లను జ్యూస్ చేసి, దానితో ఒక గ్లాసు జ్యూస్ తాగుతారు. అయితే, భోజనంతో పాటు పండ్లు తినడం ఎప్పుడూ మంచిది కాదు. ఇది మీ జీర్ణవ్యవస్థకు హాని కలిగిస్తుంది. ఇది భోజనం యొక్క జీర్ణక్రియ మరియు దానిలోని పోషకాలను గ్రహించడంలో కూడా సమస్యలను కలిగిస్తుంది.

**చీజీ ఫుడ్‌తో కూడిన శీతల పానీయాలు తాగడం:** జున్ను పిజ్జాతో పాటు శీతల పానీయాలు తాగడం చాలా మందికి అలవాటు. ఇది చాలా సాధారణమైన ఫుడ్ కాంబినేషన్, అయితే ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని మీకు తెలుసా. ఇలా చేయడం వల్ల కడుపు ఉబ్బరం, కడుపునొప్పి, నిద్రలేమి వంటి సమస్యలు వస్తాయి.

**గుడ్లతో వేయించిన మాంసాన్ని తినవద్దు:** మీరు మాంసాహారులైతే, మీరు తరచుగా వేయించిన మాంసంతో గుడ్లు తినడానికి ఇష్టపడతారు. ఇది ఖచ్చితంగా క్లాసిక్ బ్రేక్ ఫాస్ట్ కాంబో, కానీ ఇది మీ జీర్ణక్రియపై ప్రభావం చూపుతుంది. గుడ్లతో బేకన్ వంటి వేయించిన మాంసాలు ప్రోటీన్‌తో నిండిన కాంబో. దీని కారణంగా మీ జీర్ణవ్యవస్థ మరింత కష్టపడాల్సి రావచ్చు మరియు మీ కడుపు ఉబ్బినట్లు అనిపించవచ్చు. అందువల్ల, ఈ రెండు ఆహారాలను ఒకదానిని తాజా పండ్లు లేదా కూరగాయలతో భర్తీ చేయడానికి ప్రయత్నించండి.

**ఆహారంతో పాటు నీరు త్రాగవద్దు:** ఆహారంతో పాటు నీటిని తీసుకోవడం చాలా సాధారణం. బహుశా మీరు మీ భోజనంతో పాటు నీటిని కూడా తీసుకుంటారు. కానీ ఇది చాలా చెడ్డ కలయిక. నిజానికి, నీరు కడుపులోని ఆమ్లాన్ని పలుచన చేస్తుంది. మీరు తిన్న ఆహారం జీర్ణం కావడానికి ఈ ఆమ్లాలు అవసరం. కానీ ఈ ఆమ్లాలు పలచబడినప్పుడు, మీ కడుపు ఆహారాన్ని జీర్ణం చేయడం చాలా కష్టమవుతుంది.

**ఫ్రైస్‌తో బర్గర్ తినకూడదు:** మీరు బయట తిన్నప్పుడు, మీరు తరచుగా ఫ్రైస్ మరియు బర్గర్ కలిపి ఆర్డర్ చేస్తారు. షాపుల్లో కూడా ఫ్రైస్, బర్గర్‌లు కలిపి వడ్డిస్తారు. అయితే, వాటిని కలిసి తినడం మానుకోండి. నిజానికి, ఫ్రైస్ మరియు బర్గర్ ప్యాటీలు రెండూ డీప్ ఫ్రైడ్‌గా ఉంటాయి. కాబట్టి వాటిని కలిపి తింటే, అవి మీ బ్లడ్ షుగర్ లెవల్స్‌ను బాగా తగ్గిస్తాయి. తక్కువ రక్తంలో చక్కెర స్థాయిలు మిమ్మల్ని అలసిపోయేలా చేస్తాయి.

**అరటిపండు, పాలు కలిపి తీసుకోకూడదు:** నిజానికి, అరటిపండు మరియు పాలు రెండూ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కానీ ఈ రెండు ఆహారాలు కలిపి తింటే బరువు సమస్య వస్తుంది. మీరు మరింత నీరసంగా కూడా అనిపించవచ్చు. బహుశా మీరు అరటిపండు స్మూతీస్‌ను తయారు చేయడం మరియు తాగడం ఇష్టపడవచ్చు. కానీ మీరు అరటిపండు మరియు పాలను కలిపి స్మూతీ లేదా షేక్ రూపంలో తినాలనుకున్నప్పుడు, మీరు అందులో పచ్చి ఏలకులు, దాల్చిన చెక్క పొడి లేదా జాజికాయ పొడిని తప్పనిసరిగా కలపాలి.

# ప్రోటీన్‌లు అధికంగా తీసుకోకూడదు






ప్రస్తుతం కాలంలో.. ఆకర్షణీయంగా కనిపించేందుకు గాను.. శరీర ఆకృతిని మార్చుకుంటున్నారు. దీని కోసం ప్రతి ఒక్కరూ స్లిమ్‌గా, ఫిట్‌గా ఉంచుకోవడానికి వివిధ రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇలాంటి క్రమంలో బరువు తగ్గడం కోసం గంటల తరబడి వ్యాయామం కూడా చేస్తారు. గంటల పాటు వ్యాయామం చేయటానికి ప్రోటీన్ కలిగిన ఆహార పదార్థాలను కూడా ఎక్కువగా తీసుకుంటారు.

ప్రోటీన్ తీసుకోవడం వల్ల ఎక్కువ సమయం వరకు ఆకలి వేయదు. అంతేగాకుండా ప్రోటీన్ శరీరంలోని కణాలను మెరుగుపరచడంలో సహాయపడుతుంది.వీటితో పాటుగా చర్మానికి మరియు జుట్టుకి కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ప్రోటీన్ శరీరానికి ఎంతో మంచి సూక్ష్మ పోషకం. కానీ ఏదైనా ఎక్కువ మోతాదులో తీసుకోవడం ఆరోగ్యానికి నష్టాన్ని కలిగిస్తుంది. ప్రోటీన్స్ అతిగా తీసుకుంటే వివిధ రకాల అనారోగ్య సమస్యలు కూడా వచ్చే అవకాశాలున్నాయ.. దీనిని ప్రోటీన్ పాయిజనింగ్ అంటారు.

**డైట్ లో ఎంత మొత్తంలో ప్రోటీన్ ఉండాలి..?**

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. మన శరీరంలోని ప్రతి కిలోగ్రాములో.. 1 గ్రామ్ ప్రోటీన్ ఉండాలి. అంతేకాకుండా శరీరంలో పిండి పదార్థాలు, కొవ్వు పరిమాణం కూడా సరైన స్థాయిలో ఉండాలి. ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల ప్రోటీన్ పాయిజనింగ్ అయ్యే అవకాశాలున్నాయి.

**బరువు పెరగటం:** ప్రస్తుతం చాలా మంది బరువు పెరుగుదలతో బాధపడుతున్నారు. దీని వల్ల తీవ్రంగా అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ప్రోటీన్లు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల ఈ సమస్యలు కలిగే అవకాశాలున్నాయని నిపుణులు తెలుపుతున్నారు.

**డీహైడ్రేషన్..** డైట్‌లో కావాల్సిన దాని కన్నా ఎక్కువగా ప్రోటీన్ తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ సమస్య కలిగే అవకాశం ఉంది. ప్రోటీన్ జీర్ణం అవ్వడానికి శరీరానికి నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరం నుండి యూరిన్ రూపంలో బయటకు వస్తుంది. అంతేకాకుండా శరీరం నుండి నీరు కూడా ఎక్కువ పరిమాణంలో బయటకు వస్తుంది. దీని వల్ల శరీరంలో నీటి కొరత ఏర్పడుతుంది.

**డిప్రెషన్..** ఆహారంలో ఎక్కువగా ప్రోటీన్ తీసుకోవడం మరియు తక్కువగా కార్బోహైడ్రేట్ లను తీసుకోవడం ద్వారా టెన్షన్, ఆందోళన, డిప్రెషన్ మరియు నెగటివ్ భావనలు వంటి సమస్యలు కలిగే అవకాశం ఉంటుంది. ఇది శరీరంలో ఒత్తిడి హార్మోనులను పెంచి డిప్రెషన్ కి కారణం అవుతుంది.

# రోజూ ఈ నీళ్లు తాగితే కేవలం 5 వారాల్లో 5 కిలోల బరువు తగ్గడం ఖాయం





లుంటాయి. చర్మం నిగనిగలాడు తుంటుంది. జీలకర్ర నీళ్లు రోజూ తాగడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగు పడుతుంది. మనం తినే ఆహారం ద్వారా పేరుకుపోయే కొవ్వు పదార్థాలు పూర్తిగా తొలగిపోతాయి. ముఖ్యంగా శరీరంలో ఉండే విష పదార్థాలు పూర్తిగా తొలగిపోతాయి. లివర్ పూర్తి ఆరోగ్యంగా ఉంటుంది.

స్థూలకాయం అతి పెద్ద సమస్య. స్థూలకాయం సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఇతర అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి. అయితే ఆయుర్వేద శాస్త్రంలో కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు.

ప్రతి భారతీయుడి ఇంట్లో తప్పకుండా లభించే పదార్థం జీలకర్ర. జీలకర్రలో కేవలం ఆరోగ్యపరమైన ప్రయోజనాలే కాకుండా అధిక బరువు సమస్యను పోగొట్టేందుకు అద్భుతంగా ఉపయోగపడుతుంది. జీలకర్ర నీళ్లు బరువు తగ్గించే ప్రక్రియకు ఉపయోగపడతాయి. పొట్ట, నడుము చుట్టూ ఉండే కొవ్వు సులభంగా కరిగిపోతుంది. వాస్తవానికి బరువు తగ్గించుకోవాలని చాలామందికి ఉంటుంది కానీ సరైన పద్ధతులు తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

రోజూ రాత్రి సమయంలో ఒక టీ స్పూన్ జీలకర్రను నానబెట్టి ఉదయం పరగడుపున ఆ నీటిని సేవించాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలి తా

జీలకర్రలోని కొన్ని రకాల ఔషధ గుణాల కారణంగా శరీరంలో అన్ని అవయవాలు సక్రమంగా పనిచేసేందుకు దోహదమౌతుంది. ముఖ్యంగా ఊపిరితిత్తుల ఆరోగ్యంగా పనిచేస్తాయి. శ్వాస సంబంధ సమస్యలుంటే తొలగిపోతాయి. ఆహారం కాస్త పేగుల్లో పేరుకుని వివిధ రకాల అనారోగ్య సమస్యకు దారితీస్తుంది. జీలకర్రలో ఫైబర్ పెద్దమొత్తంలో ఉండటం వల్ల కడుపు నిండుగా ఉన్నట్టుంటుంది. దాంతో ఆకలి నియంత్రణలో ఉంటుంది. శరీరంలో చెడు కొవ్వును జీరకర్ర నీళు చాలా సులభంగా కరిగిస్తాయి.

ఇక మరోవైపు మెంతి గింజలు కూడా బరువు తగ్గేందుకు, నడుము, పొట్ట చుట్టూ కొవ్వు కరిగించేందుకు అద్భుతంగా ఉపయోగపడతాయి. దీనికోసం మెంతిగింజల్ని నీళ్లలో నానబెట్టి ఉదయం తాగడం వల్ల మంచి ఫలితాలుంటాయి.

# నోటి పూత సమస్యతో ఇబ్బంది పడుతున్నారా..?



నోటి పూత అనేది సర్వసాధారణ సమస్య. సమస్యతో ఆరోగ్యానికి ప్రమాదం లేకపోయినప్పటికీ తినడానికి , తాగడానికి కూడా చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. కడుపులో వేడి ఎక్కువగా ఉండడం వల్ల ఈ సమస్య వస్తుంది. అలాగే మితిమీరిన మసాలా ఆహారం, కడుపు నొప్పి, మలబద్ధకం కారణంగా కూడా నోటి పూత తరచుగా సంభవిస్తుంది. కొన్ని సార్లు నోటి పుండ్లు హార్మోన్ల అసమతూల్యత, పీరియడ్స్ వంటి ఇతర కారణాల వల్ల సంభవించవచ్చు. అయితే ఈ సమస్యను ఎలా నివారించాలో తెలుసా..?

నోటి పూత సమస్యను నయం చేసేందుకు ఆహారంలో మార్పులు అవసరం. ఈ సమయంలో మీరు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకుంటే కడుపులోని సమస్యలు దూరమవుతాయి. ఫలితంగా సమస్య దూరమై పోతుంది.

చెంచా ధనియాల పొడిని నీటిలో వేసి మరిగించి తాగినా సమస్య నుంచి ఉపశమనం కలుగుతుంది. సమస్య ఉన్న సమయంలో రోజుకు 3 సార్లు ఇలా తాగితే చాలు.

తేనెలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉన్నందున ఇది కూడా నోటి అల్సర్లను తొలగించడంలో సహాయపడుతుంది. కావాలంటే, తేనెను నేరుగా నోటి పుండ్లపై పూయవచ్చు.

ఏలకుల పొడిని తేనెతో కలిపి అల్సర్ల మీద రాయడం ద్వారా కూడా తొందరగా ఉపశమనం లభి స్తుంది. ఏలకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు ఉన్నందున మీరు ఇలా రోజుకు రెండు సార్లు చేసినా సరిపోతుంది.

మల్లె మొక్క ఆకులు కూడా నోటి పూత సమస్య నివారణలో సమర్థవంతంగా పనిచేస్తాయి. ఇందు కోసం మల్లె మొక్క ఆకుల రసాన్ని నోటి పుండ్లపై అప్లై చేస్తే సరిపోతుంది.

నోటి పూత నివారణ కోసం వెన్న లేదా నెయ్యిని కూడా ఉపయోగించవచ్చు. నోటి పుండ్లపై వెన్న లేదా నెయ్యిని రోజులో 4 సార్లు రాస్తే సరిపోతుంది.

కొబ్బరి నూనె కూడా నోటి పూత సమస్య నివారణకు చక్కని ఎంపిక. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు వాపు, గాయాలను తగ్గించడంలో సహాయపడతాయి.

వీటితో పాటు నిత్యం తీసుకునే ఆహారంలో తాజా కూరగాయలు, పండ్లు కూడా ఉండేలా చూసుకోవాలి. కూరగాయలు, పండ్ల నుంచి లభించే పోషకాలు శరీర ఆరోగ్యాన్ని కాపాడడంతో పాటు అనేక సమస్యల నివారణలో కీలకంగా పనిచేస్తాయి.

# లిప్‌స్టిక్‌తో అందమే కాదు అనారోగ్యం కూడా..



ఆకర్షణీయంగా కనిపించాలని మగువలు ఉపయోగించే కాస్మటిక్స్‌లో లిప్‌స్టిక్ కూడా ఒకటి. అయితే నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ వెబ్‌సైట్‌లోని ఓ అధ్యయనం ప్రకారం, లిప్‌స్టిక్‌లో రంగును తయారు చేయడానికి మాంగనీస్, సీసం, కాడ్మియం వంటి రసాయనాలను ఉపయోగిస్తారు. ఇవి ఉన్న లిప్‌స్టిక్ వాడటం వల్ల శరీరంలో అలర్జీ వస్తుంది.

ఆకర్షణీయంగా కనిపించాలని మగువలు ఉపయోగించే కాస్మటిక్స్‌లో లిప్‌స్టిక్ కూడా ఒకటి. అయితే నేషనల్ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ ఇన్ఫర్మేషన్ వెబ్‌సైట్‌లోని ఓ అధ్యయనం ప్రకారం, లిప్‌స్టిక్‌లో రంగును తయారు చేయడానికి మాంగనీస్, సీసం, కాడ్మియం వంటి రసాయనాలను ఉపయోగిస్తారు. ఇవి ఉన్న లిప్‌స్టిక్ వాడటం వల్ల శరీరంలో అలర్జీ వస్తుంది.

అలాగే లిప్‌స్టిక్ తయారీలో ఉపయోగించే సీసం గర్భధారణకు కూడా ప్రమాదకరం. ఇది గర్భిణీ స్త్రీ, ఆమె పిండానికి హాని కలిగిస్తుంది. లిప్‌స్టిక్ పెదవుల ద్వారా కడుపులోకి చేరి రక్తంలోని సీసం స్థాయిని పెంచుతుంది.

లిప్‌స్టిక్‌లోని కెమికల్స్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. లిప్‌స్టిక్‌లో కలిపే పెట్రో కెమికల్ వల్ల తెలివితేటలు, పునరుత్పత్తి వ్యవస్థ, శారీర ఎదుగుదలపై చెడు ప్రభావం పడుతుంది.

కాబట్టి లిఫ్టిక్‌ను డైరెక్ట్‌గా పెదవులపై వేసుకోకుండా, అంతకు ముందుగానే పెదవులకు కొంచెం కొబ్బరి నూనె అప్లై చేసుకోవాలి. ఆ తరువాతే లిఫ్టిక్ పూసుకోవాలి. కొబ్బరి నూనె పెదవులకు నష్టం కలగకుండా రక్షణ కవచంలా సహాయపడుతుంది.

## లెమన్ టీ తాగితే ఆరోగ్యానికి భరోసా, ఎందుకో తెలుసా?



లెమన్ టీ. ఈ టీని తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. పలు అనారోగ్య రుగ్మతలను నివారించే శక్తి లెమన్ టీలో వున్నది. ఆ ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాము. లెమన్ టీ తాగితే కిడ్నీలో రాళ్లను నివారిస్తుంది. గొంతు నొప్పి, దగ్గుకు ఉపశమనం కావాలంటే లెమన్ టీ తాగితే మంచిది.

రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించే శక్తి లెమన్ టీకి వున్నదని నిపుణలు చెప్తారు. లెమన్ టీ తాగితే అధిగ బరువు తగ్గే అవకాశం వుంది. జీర్ణవ్యవస్థను శుభ్రపరిచేందుకు లెమన్ టీ దోహదపడుతుంది. అతిసారానికి చికిత్సగా ఈ టీని వాడుతారు. ప్రాణాంతక వ్యాధి క్యాన్సర్‌తో పోరాడే శక్తి దీనికి వుంది.

# ఖర్జూరాన్ని పాలతో కలిపి తాగితే ఎన్నో ఉపయోగాలు



ఎముకలు స్ట్రాంగ్‌గా ఉండాలంటే కాల్షియం అవసరం. అందుకోసం పాలు తాగాలని చెబుతున్నారు. ఇక వీటితో పాటు ఖర్జూరంలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఈ రెండింటిని కలిపి తీసుకుంటే శరీరానికి పోషకాలు అందుతాయి. ఈ రెండూ కలిస్తే ఏర్పడే కొన్ని అణువులు కూడా శరీర ఆరోగ్యంలో మంచి మార్పులను తీసుకొస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల కలిగే లాభాలు ఏంటో పూర్తి వివరాలు తెలుసుకోండి.

**కీళ్ళ నొప్పులు..** పాలలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. మీరు ఇందులో ఖర్జూరాన్ని కలిపినప్పుడు బెనిఫిట్స్ పెరుగుతాయి. పాలలో ఖర్జూరాన్ని కలిపితే కీళ్ళ నొప్పులు తగ్గి ఎముకల సాంద్రత పెరుగుతుంది. అదే విధంగా బలం పెరుగుతుంది. వీటితో పాటు సీజనల్ ఇన్ఫెక్షన్స్, వాపు కూడా దూరమవుతాయి.

**జ్ఞాపకశక్తికి..** జ్ఞాపకశక్తిని పెంచడంలో ఖర్జూరం పాలు కూడా ఉన్నాయి. వీటిని తాగడం వల్ల నాడీ వ్యవస్థను ఉత్తేజపరుస్తుంది. బ్రెయిన్ డెవలప్‌మెంట్‌ని పెంచుతుంది. ఓ గ్లాసు పాలలో రెండు ఖర్జూరాలు వేసి రోజూ రాత్రి పడుకునే ముందు పిల్లలకు ఇస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. ఈ ఖర్జూరంలోని విటమిన్ బి 6 మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో రోజంతా చురుగ్గా ఉంటారు.

**జీర్ణ సమస్యలకి చెక్..** చాలా మందికి జీర్ణ సమస్యలు ఎదురవుతాయి. అలాంటి వారు ప్రతిరోజూ రాత్రి పాలలో ఖర్జూరాన్ని కలిపి తాగితే జీర్ణశక్తి పెరుగుతుంది. ఖర్జూరంలోని ఫైబర్ జీర్ణక్రియని మెరుగ్గా చేసి మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

**చర్మ కాంతి..** ఖర్జూరంతో కలిసిన పాలు తాగడం వల్ల చర్మంపై మంట, చికాకు వంటి సమస్యలు తగ్గుతాయి. పాలలో ఖర్జూరం కలిపి తాగితే రక్త ప్రసరణ పెరిగి మీ ముఖం సహజంగానే మెరుస్తుంది. కాబట్టి, రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని పాలలో 2 ఖర్జూరాలు తీసుకోవడం మరువొద్దు.

**రక్తహీనత..** ఖర్జూరంలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఈ ఐరన్ శరీరమంతటా రక్త సరఫరా సరిగ్గా జరగడానికి హెల్ప్ అవుతుంది. శరీరానికి అవసరమైన రక్తం, హిమోగ్లోబిన్ తగ్గినప్పుడు రక్తహీనత ఏర్పడుతుంది. ఖర్జూర పండ్లని తీసుకోవడం వల్ల రక్తహీనత దూరమవుతుంది. అందుకే, రోజూ పడుకునే ముందు ఓ గ్లాసు గోరువెచ్చని పాలలో 2 ఖర్జూరాలు కలిపి తాగితే రక్తహీనత దూరమై హిమోగ్లోబిన్ పెరుగుతుంది.

**కండరాల బలం..** కండరాలు దృఢంగా ఉండేందుకు పోషకాహార నిపుణులు ప్రోటీన్ ఫుడ్ తీసుకోమంటారు. ప్రోటీన్ ఫుడ్ తీసుకోవడం వల్ల కండరాలకి, చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. పాలు, ఖర్జూరం రెండింటిలోనూ ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి, ఈ రెండింటినీ కలిపి తీసుకుంటే కండరాల బలం పెరుగుతుంది.

**లైంగిక ఆరోగ్యం..** ఆధునికంగా మారిన లైఫ్‌స్టైల్ కారణంగా సంతానలేమి, నపుంసకత్వం, అంగస్తంభన సమస్యల వంటి పునరుత్పత్తి, లైంగిక సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సమస్యను దూరం చేసేందుకు లైంగిక ఆరోగ్యం మెరుగయ్యేందుకు పునరుత్పత్తి వ్యవస్థను ఆరోగ్యంగా చేయడానికి రాత్రి ఖర్జూరం పాలు తాగడం మంచిది.

# కళ్లద్దాలను శుభ్రం చేయాలా..



ఇప్పుడు అందరూ ఫ్యాషన్ గా కళ్లద్దాలను వాడుతున్నారు. కొంత మంది దృష్టి లోపం కారణంగా కళ్లద్దాలను ఉపయోగిస్తున్నారు. మరికొంత మంది కాంటాక్ట్ లెన్స్ లను ఉపయోగిస్తుంటారు. కానీ కాంటాక్ట్ లెన్స్ ని ధరించడం చాలా కష్టం. కళ్లకు చికాకుగా ఉంటాయి. దీంతో చాలా మంది కళ్లద్దాలనే యూజ్ చేయడానికి ప్రిఫరెన్స్ ఇస్తున్నారు. దీంతో రంగు రంగుల కళ్లద్దాలను ఎంపిక చేసుకుని వాడుతున్నారు. అయితే కళ్లద్దాలపై దుమ్మూ, ధూళి పేరుకుంటుంది. అంతే కాకుండా గీతలు కూడా పడతాయి. నార్మల్ క్లాత్ తో తుడిచినా అంత తేలిగ్గా పోవు. వీటిని క్లీన్ చేయడం చాలా కష్టం. దీంతో కొత్తవి తీసుకుంటూంటారు. అలా కాకుండా ఇంటి చిట్కాలను ఉపయోగించి కళ్లద్దాలను చక్కగా క్లీన్ చేసుకోవచ్చు. ఎలానో తెలుసుకోండి.

**టూత్ పేస్ట్:** సాధారణంగా కళ్లద్దాల మీద గీతలు పడుతూ ఉంటాయి. ఈ గీతలు అంత తేలిగ్గా పోవు. వీటిని తొలగించుకోవడానికి టూత్ పేస్ట్ గా హెల్ప్ చేస్తుంది. టూత్ పేస్ట్ తో దంతాలను తెల్లగా మారతాయో.. కళ్ల అద్దాలను కూడా అలాగే తెల్లగా మార్చుతుంది. ఒక మెత్తటి క్లాత్ తీసుకుని.. దానిపై కొద్దిగా పేస్ట్ వేసి.. కళ్లద్దాలపై సున్నితంగా రుద్దండి. ఆ తర్వాత మరో క్లాత్ తీసుకుని వాటర్ ముంచి కళ్లద్దాలపై క్లీన్ చేసుకుంటే సరి. ఇలా చేస్తే కళ్లద్దాలపై ఉండే దుమ్ము, ధూళి, గీతలు, మసకగా ఉండటం పోయి తెల్లగా, క్లీన్ గా కనిపిస్తాయి.

**బేకింగ్ సోడా:** కళ్లద్దాలను తెల్లగా మార్చడంలో బేకింగ్ సోడా కూడా బాగా హెల్ప్ చేస్తుంది. ఒక చిన్న బౌల్ తీసుకుని అందులో కొద్దిగా నీరు, కొంచెం బేకింగ్ సోడా వేసి కలపండి. ఆ తర్వాత ఒక మెత్తటి క్లాత్ తీసుకని.. బేకింగ్ సోడా మిశ్రమంలో ముంచి.. కళ్లద్దాలపై సున్నితంగా తుడవాలి. ఇలా చేస్తే కళ్లద్దాలపై ఉండే దుమ్ము, ధూళి, గీతలు వంటివి పోతాయి.

**అంట్ల సబ్బు:** అంట్ల సబ్బుతో కూడా కళ్ల జోడును, లెన్స్ ను కూడా క్లీన్ చేసుకోవచ్చు. దీని వల్ల ఎలాంటి నష్టాలు ఉండవని నిపుణులు చెబుతున్నారు. చేతి వేళ్లను ఉపయోగించి లెన్స్ లను డిష్ సోప్ తో శుభ్రం చేసుకోవచ్చు. డిష్ సోప్ లో చేతి వేళ్లు పెట్టి.. వాటితో నెమ్మదిగా లెన్స్ లపై రుద్దాలి. ఇలా చేయడం వల్ల అవి శుభ్ర పడతాయి. కళ్లద్దాలను క్లాత్ సహాయంతో క్లీన్ చేసుకోవాలి. అయితే ఒక విషయం ముఖ్యంగా గుర్తించుకోవాలి. సిట్రస్ తయారు చేసిన సోప్ లను వాడ కూడదు.

# బీమా పెంపుపై హర్షం



**అమరావతి:** ప్రజా రవాణా శాఖ ఉద్యోగులకు ప్రమాద బీమా 30 లక్షల రూపాయలు నుండి 85 లక్షల రూపాయల పెంపుపై ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల వైఎస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ హర్షం తెలిపింది. ఈ మేరకు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.వి.రావులతో బృందం కమిషనర్ ద్వారక తిరుమల రావు కు ఉద్యోగుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. గురువారం కేంద్ర కార్యాలయంలో రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అద్వర్యంలో కమిషనర్ ద్వారక తిరుమల రావు అధ్యక్షతన ఎస్.బి.ఐ జనరల్ మేనేజర్, ఓం నారాయణ, డి.జి.ఎంలు మనీష్ కుమార్, దినేష్ గులాటి, ఎ.జి.ఎం సత్య స్వరూపిణి తదితర అధికారుల సమక్షంలో ఎం.ఓయు జరిగింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజా రవాణా శాఖ ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి విశ్వరూప్ ఆశయాల మేరకు కమిషనర్ ద్వారక తిరుమల రావు కృషి చేస్తున్నారని, అయిన సేవలను కొనియాడారు. అందుకు ప్రధాన కార్యాలయం లో పనిచేస్తున్న అదనపు కమిషనర్లు బ్రహ్మనంద రెడ్డి, ఎ.కోటేశ్వరరావు, కృష్ణ మోహన్, రాఘవరావులు పనిచేస్తున్నారని చెప్పారు. వాళ్లందరికీ ఫెడరేషన్ తరుపున ధన్యవాదాలు తెలిపారు.

# ఏయూ తెలుగు విభాగం లో అతిథి ఉపన్యాసం

## నేటి చలనచిత్రాలకు ముడిసరుకు ప్రాచీన సాహిత్యమే

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వకళాపరిషత్, తెలుగు విభాగం ఆధ్వర్యంలో "తెలుగు సాహిత్యం-జీవన నైపుణ్య విలువలు" అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించబడింది. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యవక్తగా ద్రావిడ విశ్వవిద్యాలయ ప్రచురణ విభాగ డైరెక్టర్ ఆచార్య డి వి శ్రావణ్ కుమార్ హాజరయ్యారు.వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విస్తారమైన తెలుగు సాహిత్యాన్ని విస్తృతంగా చదవగలిగితే అభివ్యక్తి నైపుణ్యాలతోపాటు వ్యక్తిత్వ వికాసాలు అలవడతాయన్నారు. ప్రాచీన, ఆధునిక సాహిత్యాలను అర్థం చేసుకుంటే భాషా పరిణామంతో పాటు భావ సౌందర్యం అర్థమవుతుందన్నారు.ప్రాచీన సాహిత్యసంపద నేటి చలనచిత్రాలకు ముడిసరుకుగా ఉందని




ఆ ముడిసరుకుతోనే ఎన్నో సినిమాలు కథేతివృత్తాలతో మలచబడి కాసులవర్షం కురిపిస్తున్నాయన్నారు. తెలుగు చదివే విద్యార్థులు ముందు సాహిత్య మర్మాన్ని గ్రహించినప్పుడే జీవన నైపుణ్య విలువలు తెలుస్తాయన్నారు.జీవన నైపుణ్య విలువలు అంగడిలో లభించే సరుకులు కావని కవుల కావ్యాలలో, పెద్దల వ్యవహారంలో లభించేవని వాటిని అకళింపు చేసుకుంటూ జీవితానికి అన్వయించుకోవాలన్నారు. కవుల రచనలు ఏ దృక్పథంతో,ఏ భావనతో వ్రాయబడ్డాయో అర్థం చేసుకోగలిగితే ననమపార్జనతో పాటు మనో వికాసం వర్ధిల్లుతుందన్నారు. మనిషి మనిషిగా మారటానికి సృజనశీలమైన సాహిత్యం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. మనిషి జీవితాన్ని బహుముఖీన కోణంలో విస్తరించి వ్యక్తిత్వవికాసానికి బాటలు వేస్తూ సమాజాభివృద్ధికి సాహిత్యమే దోహదం చేస్తుందన్నారు. నాటి కవుల ఆలోచనాదృక్పథాన్ని కావ్యాలలోని ఆయా పాత్రల ద్వారా వెల్లడించారని ఆ పాత్రల మనస్తత్వాన్ని విశ్లేషణ చేసుకోగలిగితే సమాజపోకడ అర్థమవుతుందని తద్వారా మానవ ప్రవర్తనను సరిదిద్దుకునే అవకాశం లభిస్తుందన్నారు.ఇదే సమాజాభివృద్ధి ప్రాతిపదిక అవుతుందన్నారు.అనంతరం అతిథిని ఆచార్యులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమం లో తెలుగు ఆచార్యులు డా ఏ సీతారత్నం ,డా ఏ ఈశ్వరమ్మ ,డా బూసి వెంకటస్వామి ,డా కట్టెపోగు రత్నశేఖర్ ,డా పెండ్యాల లావణ్య ,డా ఏ వెంకటేశ్వర్లు (యోగి ),పరిశోధక విద్యార్థులు, స్నాతకోత్తర విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జల దీక్ష

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు వైసిపి ప్రభుత్వం అక్రమ అరెస్టు చేసి జైలుకు తరలించినందుకు నిరసనగా శుక్రవారం ఉదయం శారదా నదిలో తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో జల దీక్ష కార్యక్రమం చేస్తూ సిబిఎన్ తో మేము ప్లే కార్డులతో నిరసన కార్యక్రమం చేశారు. సైకో పోవాలి బాబు రావాలి జగన్ రెడ్డి నశించాలి చంద్రబాబు క్షేమంగా రావాలి అనే నినాదాలు చేస్తూ నిరసన తెలుగుదేశం పార్టీ శ్రేణులు చేశారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లో అవినీతి జరిగిందని క్షేత్రస్థాయిలో ఉన్న కేంద్రాలను పరిశీలించకుండా శిక్షణ తీసుకున్న విద్యార్థులకు శిక్షణ ఇచ్చారా లేదా ఇవి పరిగణలోకి తీసుకోకుండా సిమెన్స్ డిజైన్ టెక్ కంపెనీలతో ఒప్పందం జరిగిన విషయాలు ఆ సంస్థలు ప్రకటించినప్పటికీ చంద్రబాబు నాయుడు పై బురదజల్లే కార్యక్రమాన్ని గోబుల్స్ ప్రచారం చేస్తున్నారని, జగన్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా చంద్రబాబుపై అవినీతి మరకలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చంద్రబాబుకు అండగా ప్రజలు మద్దతు తెలియజేస్తున్నారని అంతిమంగా చంద్రబాబు విజయం సాధిస్తారని నాగ జగదీష్ అన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం వల్ల తాత్కాలికంగా చంద్రబాబు నాయుడు ఇబ్బందులు కలిగిన ప్రజల మద్దతుతో బయటికి వస్తారని ప్రజా సేవకు అంకితం అవుతారని నాగ జగదీష్ అన్నారు.ఈ



కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు సురేసతీష్ ఆళ్ల రామచంద్రరావు బోడి వెంకట్రావు బొడ్డేడ మురళి మల్ల గణేష్ కర్రి మల్లేశ్వరరావు బుద్ధ శ్రీనివాసరావు అండి బోయిన శేషు విల్లూరి రమణబాబు బుద్ధ భువనేశ్వర్రావ్ మారిశెట్టి శంకర్రావు పెంటకోట శివరాం సాలాపు నాయుడు వానపల్లి కోటేశ్వరరావు శిలపరిశెట్టి భాస్కరరావు పెంటకోట వరప్రసాద్ బుద్ధ ఈశ్వరరావు చదరం శివ మల్ల శివన్నారాయణ సారిపల్లి శ్రీనివాసరావు మల్ల జగదీష్ విల్లూరు సత్తిబాబు బుద్ధ లక్ష్మీ అప్పారావు బుద్ధ ఈశ్వరరావు సూరిశెట్టి బల్లమ్మ బుద్ధ మహాలక్ష్మి నాయుడు రేవిడి రాంబాబు పాలిమేర నాయుడు పెంటకోట వెంకటరమణ సూరిశెట్టి నూక శివ అప్పారావు పిలా శ్యాము షేక్ రియాజ్ కొణతాల బాల బివిఎస్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్‌ని కలిసిన ఎంపీ ఎంవివి సత్యనారాయణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారత మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ ను విశాఖ ఎంపీ తూర్పు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త గౌరవనీయులు ఎం.వి.వి సత్యనారాయణ గారు మర్యాదపూర్వకంగా స్వామివారి దర్శనం అనంతరం తిరుమలలో కలిశారు. ఈమేరకు తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో స్వామివారిని ఇరువురు దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయ కార్య నిర్వహణ అధికారులు వారికి దర్శనానంతరము తీర్థప్రసాదాలు అందజేశారు.

# 23న జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘముల సమావేశాలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘముల సమావేశములు రేపు తేది. 23.09.2023 ( శనివారం ) దీన ఉదయం 10 గంటల నుండి గౌరవ చైర్పర్సన్ శ్రీమతి జె. సుభద్ర వారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.శ్రీరామ్మూర్తి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన జారీచేసారు. జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.00 గం.లకు స్థాయి సంఘముల సమావేశాలు ప్రారంభం అవుతాయన్నారు. ఉదయం 10.00 గం.లకు 2, 5 వ స్థాయి, 11.00 గం.లకు 3, 4 వ స్థాయి, మధ్యాహ్నం 12.00 గం.లకు 1, 6, 7 వ స్థాయి సంఘముల సమావేశములు నిర్వహించడం జరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

# స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై జరుగుతున్న ఉద్యమానికి 902 రోజులు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్టీల్ ప్లాంట్ పరిరక్షణకై జరుగుతున్న ఉద్యమానికి మద్దతు తెలియజేస్తూ ఐద్వా విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ వద్ద జరుగుతున్న నిరాహార దీక్షలో కూర్చోవడం జరిగింది.

నేటికి 902 రోజులు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా అధ్యక్షులు బి. పద్మ మాట్లాడుతూ విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో ఉద్యమం రాష్ట్ర వ్యాపితంగా జరిగింది. 32 మంది బలిదానం చేశారు. వేలాది ఎకరాలు భూమి త్యాగం చేసి స్థానికులు నిర్వాసితులయ్యారు.ఇంత చారిత్రక పోరాటం గల స్టీల్ ప్లాంటును అమ్మేస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరు అనే దానికి తార్కాణం జనవరి 30తేది కి 2 సంవత్సరాలు పూర్తి అయినా ఉక్కు ఉద్యమం స్ఫూర్తితో ముందుకు తీసుకువెళ్లడం చాలా గొప్ప విషయం . దేశంలోనే స్టీల్ ఉద్యమం స్ఫూర్తి దాయకంగా నిలిచింది. .దేశానికే వన్నె తెచ్చింది విశాఖ స్టీల్ ప్లాంట్. అంతే కాదు నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేస్తుంది. లాభాల్లో నడుస్తుంది. ప్రభుత్వరంగ సంస్థలే ఈ దేశానికి పట్టుగొమ్మలు అని అన్నారు. అటు వంటి సంస్థల యొక్క కొమ్ములను బిజెపి ప్రభుత్వం విరిచేస్తుంది. నిరుద్యోగ సమస్య పరిష్కరించాల్సింది పోయి పెంచుతుంది. ప్రభుత్వరంగ సంస్థలు ఉంటేనే మహిళలకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. ప్రైవేటీకరణ జరిగితే ఉద్యోగాల్లో మహిళా రిజర్వేషన్ ఉండదు.ఉత్తరాంధ్ర అభివృద్ధి స్టీల్ ప్లాంట్ పై ఆధారపడి ఉందని, ఈ ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారాలని, ఈ ఉద్యమం అందరూ పాల్గొని కేంద్రం లో ఉన్న బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. 29 వతేదిన కూర్మాన పాలెంలో జరిగే బహిరంగ సభ కి మహిళల్ని ఎక్కువ మందిని సమీకరించి బిజెపి తగిన బుద్ధి చెబుతాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో, Y. సత్యవతి,ఆర్. వరలక్ష్మి, కె.మణి, A. పుష్పాంజలి సాహూ, కె.వేణు, కె. అనురాధ, బి భారతి, T.K. శారద, A. సంజు, M. లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయండి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం ను అభివృద్ధి చేయడానికి విశాఖ పట్నం పోర్ట్ ట్రస్ట్ సి ఎస్ ఆర్ నిధులు మంజూరు చేయాలని షిప్పింగ్ , పోర్టుల అభివృద్ధి మంత్రి శర్వానంద్ సోనోవాల్ ని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతి కోరారు. తాను కూడా తన ఎంపి నిధులను మ్యాచింగ్ గ్రాంట్ గా విడుదల చేస్తానని తెలిపారు.అన్నిరకాల క్రీడాపోటీ లకు అనుగుణంగా గ్రౌండ్ ను అభివృద్ధి చేయడానికి ఇప్పటికీ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిరుత పులి పిల్లల కలకలం



**సిరిసిల్ల జిల్లా:** సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగలపల్లి శివారులో చిరుత పిల్లల సంచారం కలకలం రేపుతోంది.

సబ్ స్టేషన్ ఎదుట ఉన్న డంపింగ్ యార్డ్ సమీపంలో చిరుతపులి రెండు పిల్లలకు జన్మనిచ్చినట్లు తెలిసింది. శుక్రవారం తెల్లవారుజామున చిరుత పులి పిల్లలను తీసుకువెళుతుండగా పొలం పనుల కు వెళుతున్న రైతు చూసి కేకలు వేయడంతో దీంతో చిరుత రైతుల అలజడి విని ఓ పిల్లను వదిలేసి వెళ్ళింది. చిరుత పిల్లను చూసేందుకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివస్తున్నారు.

చిన్న చిరుతతో ప్రజలు సెల్ఫీలు దిగుతూ స్టేటస్ లు పెట్టుకుంటున్నారు. సమాచారం అందుకున్న సంబంధిత అటవీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని చిరుత పిల్లను కరీంనగర్ కు తరలించారు.

చిరుత పిల్ల లభ్యం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో చిరుత ఎప్పుడు దాడి చేస్తుందోనని ప్రజల్లో భయాందోళనలు మరింత పెరిగాయి.

# సర్వజన ఆసుపత్రిలో రూ.10.50 లక్షలతో ఆర్వో ప్లాంట్

**విజయనగరం:** ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులు, విధులు నిర్వహించే వైద్యులు, సేవలందించే సిబ్బంది సౌకర్యార్థం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రూ.10.50 లక్షలు జిల్లా పరిషత్ నిధులు వెచ్చించి ఆర్.ఓ. ప్లాంటు నిర్మించామని జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన దీనికి జలప్రసాదం అని నామకరణం చేశామని, ఇక నుంచి 24 గంటల పాటూ పరిశుద్ధమైన తాగునీరు లభ్యమవుతుందని చెప్పారు.

స్థానిక సర్వజన ఆసుపత్రి ముందు భాగంలో జడ్పీ నిధులతో నిర్మించిన ఆర్.ఓ. ప్లాంటును శుక్రవారం ఉదయం జిల్లా పరిషత్ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ లాంఛనంగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ప్లాంటు లోపల ఏర్పాటు చేసిన ట్యాంకులను, సాంకేతిక పరికరాలను జడ్పీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వైద్యుల విజ్ఞప్తులను పరిగణనలోకి



తీసుకొని ప్లాంటు నిర్మాణానికి జిల్లా పరిషత్ నిధులు రూ.10.50 లక్షలను వెచ్చించామని గుర్తు చేశారు. వెయ్యి లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకులను ఏర్పాటు చేశామని, అలాగే కూలింగ్ వాటర్ కోసం ప్రత్యేకంగా మరో 80 లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకును ఏర్పాటు చేశామని చెప్పారు. ప్లాంటు నుంచి పగలు, రాత్రి కూడా తాగునీరు వస్తుందని ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్లాంటు నిర్వహణ కోసం మరో రూ.2.50 లక్షలు అవసరమవుతుందని ఆర్.డబ్ల్యు.ఎస్. ప్రస్తావించగా జడ్పీ ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. ప్రతిపాదనల మేరకు చర్యలు తీసుకోవాలని పక్కనే ఉన్న జడ్పీ సీఈవోకు సూచించారు.

**క్యాంటీను ఏర్పాటుకు త్వరలోనే చర్యలు**

ఆసుపత్రిలో అన్ని రకాల వసతులూ సమకూరస్తున్నామని, క్యాంటీన్ ఒకటి ఉండిపోయిందని జిల్లా కలెక్టర్ వద్ద జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రస్తావించారు. దానిని కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యోచిస్తున్నట్లు జడ్పీ ఛైర్మన్ పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు దీనిపై చర్చించామని త్వరలోనే ఓ నిర్ణయం తీసుకుంటామని ఆసుపత్రి ఉన్నతాధికారులతో చెప్పారు. అనంతరం ప్లాంటు ఏర్పాటుకు సంబంధించిన శిలాఫలకాన్ని జిల్లా కలెక్టర్, మేయర్లతో కలిసి జడ్పీ ఛైర్మన్ ఆవిష్కరించారు.

కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జడ్పీ సీఈవో రాజ్ కుమార్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఈ. ఉమా శంకర్, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. అప్పలనాయుడు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. పద్మలీల, వైద్యాధికారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వామ్మో.. వర్షంలా కురిసిన పెట్రోల్..!

## నాలుగు వేల లీటర్లు నేలపాలు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** అమ్మో..! ఒకటి రెండు కాదు.. ఏకంగా నాలుగు వేల లీటర్ల పెట్రోలు వృధాగా నీటి పాలైంది.పెట్రోల్ తో తడిచి ముద్దైన ట్రక్ డ్రైవర్ త్రుటిలో తప్పించుకున్నాడు. విశాఖ ఐఓసీ టెర్మినల్లో పెట్రోల్ ఫిల్లింగ్ పైప్ పగిలిపోయిన సంఘటనలో ఘోర ప్రమాదం తప్పింది. ఈ ఘటన విశాఖ సింధియా లోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీ) టెర్మినల్ లో చోటు చేసుకుంది. సరిగ్గా 10.30 గంటల సమయంలోనే లోడింగ్ కోసం ఆయిల్ ట్యాంకర్ టెర్మినల్ లోని ర్యాంపుపైకి వెళ్లింది. ఆ ర్యాంప్ 4 కేఎల్ ఛాంబర్ కు చెందింది. వెంటనే అన్లోడింగ్ ప్రక్రియ ప్రారంభం అయింది. సాధారణంగా ఛాంబర్ నిండిన తర్వాత వాల్వు కట్టేయాలి. అలా వాల్వు కట్టేలోపు అప్రమత్తంగా లేని ట్యాంకర్ డ్రైవర్ వాహనాన్ని ఒక్కసారి గా ముందుకు పోనిచ్చాడు. దాంతో ఒక్కసారిగా కలకలం రేగింది. అక్కడే ఉన్న కార్మికులు ఎంత గట్టిగా అరచినా డ్రైవర్ కు వినపడలేదు. అలాగే ఒక్కసారిగా ముందుకు వెళ్ళాడు.

దీంతో ట్యాంకర్లోకి మోటారు స్పిరిట్ సరఫరా చేస్తున్న పైపు పగిలిపోయింది. పెట్రోల్ ఒక్కసారిగా ఎగజిమ్మింది. దీంతో అందరిలో తీవ్ర అలజడి రేగింది. లక్షల లీటర్ల వ్యూహాత్మక పెట్రో నిల్వలు ఉన్న ప్రాంతం కావడం తో ఏదైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందేమో అన్న ఆందోళన. దీంతో ఫైర్ ఫైటర్స్ కూడా సిద్దం అయాయి. ఒక్కసారిగా అలారం మోగింది. అంతా అలెర్ట్ అయ్యారు.

**పెట్రోల్ పైన పడడంతో తడిచి ముద్దైన మరో ట్యాంకర్ డ్రైవర్**

ఆన్ లోడ్ చేస్తున్న ట్యాంకర్ ఒక్కసారిగా ముందుకు వెళ్లడంతో పైపు విరిగి వెదజల్లిన ఆ ఇంధనం పక్కనే ఉన్న మరో ట్యాంకర్ డ్రైవర్ ఆరీఫ్ (50) పై వర్షం లా పడింది. దీంతో ఆరిఫ్ తడిసి ముద్దయ్యాడు. అంతే ఒక్కసారిగా మరింత ఆందోళన పెరిగింది. ఆ సమయంలో ఏదైనా ఒక్క స్పార్క్ చెలరేగితే ఆరీఫ్ తో సహా.. మొత్తం టెర్మినల్ కే ఊహించనంత పెద్ద ముప్పే ఏర్పడేది. ప్రమాదాన్ని పసిగట్టిన ఫైర్ సేఫ్టీ అధికారులు మెయిన్ ట్యాంకు వద్ద ఎంఎస్ బ్లాక్ వాల్వు మూసేసారు. దాంతో ఆయిల్ స్ప్రెడ్ ఆగిపోయింది. వెంటనే ఆరీఫ్ వంటిపై వేల లీటర్ల కొద్దీ నీళ్లతో అక్కడే స్నానం చేయించారు. అలా చేయిస్తూనే ఉండగా ఇంతలో అతడి శరీరమంతా ఎర్రటి దద్దుర్లు ఏర్పడ్డాయి . తక్షణం అందుబాటులో ఉన్న అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరిఫ్ హాస్పిటల్ లో కోలుకుంటున్నారు.

**మొత్తంగా 4 వేల లీటర్ల పెట్రోల్ నేలపాలు**

విశాఖ ఫిల్లింగ్ ప్లాంట్లో గురువారం మోటారు స్పిరిట్ -ఎంఎస్-పెట్రోల్ పైపు పగిలిన ఈ ఘటనలో ట్యాంకర్ లో ఉన్న 4 వేల లీటర్ల పెట్రోల్ వృథాగా పోయింది. దాంతో ఆ ప్రాంతం అంతా పెట్రోల్ తో నిండిపోయింది. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో కదలికలపై ఆంక్షలు విధించారు. అటువైపుగా ఎవ్వరినీ వెళ్లనివ్వలేదు. తక్షణం అక్కడ పారిన పెట్రోల్ మొత్తం ఆయ్యే విధంగా చర్యలు చేపట్టారు. మంటలు చెలరేగకుండా ఫోమ్ ను స్ప్రే చేశారు. ఒకటేమిటి, ఆ సమయంలో అక్కడ యుద్ధ వాతావరణమే కనిపించింది. పరిస్థితులు ప్రస్తుతానికి పూర్తి అదుపులోనే ఉన్నట్టు స్పష్టం చేశారు అధికారులు. కాస్త సద్దుమణిగాక కార్యకలాపాలు పునః ప్రారంభం అవుతాన్నరు అధికారులు.

# రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల శాఖల సంయుక్త సమావేశం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** నియోజకవర్గములో గల రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారదల శాఖలు సంయుక్త సమావేశాన్ని మండల తహశీల్దార్ పి. భాగ్యవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడు తూ ప్రస్తుతం ఖరీఫ్ 2023 సీజన్ కు జూన్ నెల నుండి ఇప్పటి వరకూ 32శాతం లోటు వర్షపాతం నమోదు జరిగిందని, 43శాతం(3000 ఎకరాలు )విస్తీర్ణంలో వరి పంటసాగులో ఉందని ఆమె అన్నారు.లోతట్టు ప్రాంతాలలో ఉన్న వరి పంట ముంపుకు గురి కాకుండా ఉండటానికి పారగట్ట, జంగాల కాలువలకు గేట్లు ఏర్పాటు చేయాలని, తామరచర్ల కాలువ గేట్లు రిపేర్ చేయించాలని,పూడిక తీత తీయించాలని రైతులు కోరారు.ఈ విషయమై ఇరిగేషన్ ఎ ఈ ఎ. భాను తక్షణమే స్పందించి సంభందిత ప్రతిపాదనలను అంచనా వేసి ఉన్నతాధికారుల ఆమోదం కొరకు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దిమిలి వైస్ ప్రెసిడెంట్ నగిరెడ్డి మురళీకృష్ణ,విఆర్వో సత్యనారాయణ, అప్పారావు, వి.ఎ.ఎ రైతులు పాల్గొన్నారు.

# భాస్కరరావు కుటుంబానికి వైయస్సార్ బీమా 10 వేలు నగదు అందజేత



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):** ఇటివల అనారోగ్యంతో మృతి చెందిన పాంగి భాస్కరరావు కుటుంబానికి వైకాపా ప్రభుత్వం అండగా ఉంటుందని వైస్ ఎంపీపీ సాగిన వెంగళరావు అన్నారు. అంజలి శనివారం పంచాయతీ పరిధిలోని పార్లుబంధ గ్రామానికి చెందిన భాస్కరరావు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడని, ఆ కుటుంబ యజమానురాలు రాధమ్మ కు తక్షణ సాయంగా వైఎస్ఆర్ బీమా ద్వారా రూ.10వేల నగదును శుక్రవారం అందజేయడం జరిగిందన్నారు. భాస్కరరావుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వెంగళరావు మాట్లాడుతూ ఇటీవల అనారోగ్యంతో మరణించడం ఆ కుటుంబానికి తీరని లోటన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా బీమా సదుపాయం అందజేయడం ఆర్థిక చేయూత అన్నారు. కుటుంబ సభ్యులు ఈ వైయస్సార్ బీమా ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుటుంబ సభ్యులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు ఎల్ బాబురావు, ఎస్ బాబురావు, వెల్ఫేర్ అసిస్టెంట్ వి రఘుబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# 2024ఎన్నికలు తరువాత వైకాపా భూస్థాపితం ఖాయం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** 2024ఎన్నికలు తరువాత వైకాపా, జగన్ రెడ్డిలు భూస్థాపితం ఖాయం అని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అన్నారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వగానే అవినీతి వైకాపా మంత్రులను జైలుకు పంపిస్తాం అని హెచ్చరించారు.మంత్రి గుడివాడ అమర్నాథ్ అవినీతి శాఖ మంత్రిగా మారారు అని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు పై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల నుండీ దూరం చేయలేరు అని అన్నారు.ఈ రోజు 11వ రోజు కశింకోట మండలం, కన్నూరు పాలెంలో మండల పార్టీ అధ్యక్షుడు కాయల మురళి అద్యక్షతన టీడీపి రిలే నిరాహారదీక్షలలో ఆయన పాల్గొన్నారు.ముందుగా స్వర్గీయ నంద మూరి తారకరామారావు విగ్రహాని కి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా టీడీపీ రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు అయనకు తమ మద్దతును తెలిపారు.రాష్ట్రంలోని ప్రజలందరూ చంద్రబాబు నాయుడు కోసం ఎదురుచూస్తున్నారు అని అన్నారు.ఎన్ని అక్రమ కేసులు పెట్టినా టీడీపీ శ్రేణులు భయపడరు అని అన్నారు. చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులకు సహకరించిన అధికారులను జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. జగన్ రెడ్డి సైకోయిజానికి రాష్ట్రంలోనీ పారిశ్రామిక వేత్తలు పారిపోతున్నారు అని ఆరోపించారు.దసరా నుండీ విశాఖ రాజధాని అని ప్రకటించగానే విశాఖ ప్రజలలో భయం పట్టుకుందని, వారి ఆస్థులను జగన్ రెడ్డి దోచుకుంటాడు అని ప్రజలకు భయం వేస్తుందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ కూండ్రాపురాము నాయుడు, ఉగ్గినా రమణ మూర్తి, గొంతిన శ్రీనివాసరావు, కుండ్రాపు అక్కూ నాయుడు, ఎర్రి నాయుడు, యూనిట్ ఇంచార్జీ చుక్కా ప్రసాద్,వేగి గోపీకృష్ణ, పెంటకోట రాము, సిద్ది రెడ్డి శ్రీనివాసరావు, కడిమిశెట్టి నరసింగరావు,మాజీ వైస్ ఎంపీపీ చిరికి సన్యాసి నాయుడు, మెడిశెట్టి సన్యాసి నాయుడు, చరకం ఈశ్వరరావు, రెడ్డి సూరిబాబు, వర్రీ పోతురాజు, కలగా సోమేశ్వర రావు,ఎంపీటీసీ బుద్ది రెడ్డి అప్పడు, నైనంశెట్టి రమణ రావు, బుద్ది రెడ్డి గంగయ్య, షేక్ బాబర్, రమేష్ సత్యనారాయణ, చేబోలు సూరిబాబు, పంచ గ్రామల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజల ఇంటిముంగిటకే వైద్య సేవలు




**విజయనగరం:** ప్రజల ఆరోగ్య పరిరక్షణే పరమావధిగా, ఇంటింముంగిటకే వైద్య సేవలను అందించే మహత్తర లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి రూపొందించారని జిల్లాపరిషత్ ఛైర్పర్సన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రెండు జిల్లాల వివిధ శాఖల జిల్లా అధికారులు, పిఆర్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారు లు, ఎంపిడిఓలు, ఇఓపిఆర్డిలతో జెడ్పి సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, పింఛన్లు, ప్రాధాన్యతా భవనాల నిర్మాణం, గడప గడపకు మన ప్రభుత్వం, వలంటీర్ల ఖాళీలు, పంచాయితీ శాఖ కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయా అధికారుల ద్వారా సంబంధిత ప్రగతి నివేదికలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష అత్యంత ప్రాధాన్యతతో కూడిన ప్రతిష్టాత్మక కార్యక్రమంగా పేర్కొన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 30 నుంచి ప్రారంభమయ్యే వైద్య శిబిరాలను, అధికారులు సమన్వయంతో కృషి చేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు. . సుమారు 105 రకాల మందులను ఉచితంగా ఇవ్వడమే కాకుండా, 14 రకాల వైద్య పరీక్షలను శిబిరాల్లో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. అవసరమైన ప్రతీ ఒక్కరికీ వైద్య సేవలను అందించాలని ఆయన సూచించారు. అర్హత ఉన్న ప్రతీఒక్కరికీ సామాజిక పింఛన్ ఇవ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు. ఆధార్ కార్డుల్లో పొరపాటున వయసు తక్కువగా నమోదైన వారు దరఖాస్తు చేసుకొంటే, వారికి మెడికల్ బోర్డు ద్వారా వయసు నిర్ధారించి, అర్హత ఉన్నవారికి పింఛన్ మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు.

గడప గడపకు మన ప్రభుత్వంతో సహా అన్ని ప్రభుత్వ భవనాలు, అభివృద్ది కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని కోరారు. ఇంజనీరింగ్ సహాయకుల సేవలను వినియోగించుకోవాలని, బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని సూచించారు. నిధులకు ఎక్కడా ఇబ్బంది లేదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. వలంటీర్ల ఖాళీలను ప్రతీవారం భర్తీ చేయాలని ఎంపిడిఓలను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, త్రాగునీరు, వీధి దీపాల నిర్వహణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. వారంలో కనీసం మూడు రోజులపాటు ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని ఛైర్పర్సన్ సూచించారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ కె.రాజ్కుమార్, విజయనగరం, పార్వతీపురం జిల్లాలకు చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇలాంటి కష్టం ఎవరికీ రాకూడదు

## కొడుకు మృతదేహాన్ని డోలీలో కట్టి తీసుకెళ్లాల్సిన పరిస్థితి



తరాలు మారుతున్న తలరాతలు మారడం లేదన్నట్టు ఉంది వాళ్ళ పరిస్థితి. ఏళ్లు గడుస్తున్నాయి.. రోజురోజుకు టెక్నాలజీ పెరుగుతోంది, సాటిలైట్ టౌన్షిప్లు అభివృద్ధి చెందుతున్నాయి. అంతరిక్షంలో కూడా అద్భుతాలు సృష్టిస్తున్నాం. ఆఖరికి చంద్రుడుపై కూడా భారత్ కాలు కూడా మోపింది. కానీ ఆ అడవి బిడ్డలు జీవితాలు మాత్రం ఇప్పటికీ మారడం లేదు. అక్కడ కనీస మౌలిక సదుపాయాలు లేక నరకయాతన అనుభవిస్తున్నారు ఆ స్థానికులు. ఒకవేళ వర్షాలు పడితే.. ఇంకా దిక్కుతోచని పరిస్థితి ఉంది. అత్యవసర వైద్య సేవలకైనా.. మృతదేహాన్ని తరలించడానికైనా రోడ్లు లేక వాళ్ళ అవస్థలు వర్ణనాతీతం. వాగులు దాటుకుంటూ డోలి కట్టి కిలోమీటర్ల ప్రయాణించడం ఆ అడవి బిడ్డలకు నిత్యకృత్యంగా మారింది. అయితే తాజాగా.. ఈ ఘటన స్థానిక సర్పంచ్కి ఎదురవ్వడం కంటతడి పెట్టించింది.

ఇక వివరాల్లోకి వెళ్తే.. అల్లూరి జిల్లాలో గిరిజనులకు ఉన్న డోలి కష్టాలు అన్ని ఇన్ని కావు. అసలే అంతంత మాత్రాన ఉండే ఆ రహదారులు.. ఆపై వర్షం పడితే వారి కష్టాలు వర్ణనాతీతం. తాజాగా స్వయాన సర్పంచికే ఒక పెద్ద కష్టం వచ్చి పడింది. అనారోగ్యంతో ఆయన కొడుకు చనిపోతే.. ఆసుపత్రి నుంచి స్వగ్రామానికి తరలించేందుకు నానా కష్టాలు పడాల్సి వచ్చింది. గుంజువాడ వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో.. మృతదేహానికి డోలి కట్టారు గిరిజనులు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు నుంచే మృతదేహం తరలించ్చారు.

ఈ ఘటన పెదబయలు మండలం జామిగూడలో చోటుచేసుకుంది. అయితే సర్పంచ్ అనెమ్మ కొడుకు చంద్ర కిరణ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతదేహం గ్రామానికి తరలిస్తుండగా గుంజువాడ వద్ద వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుంది వాగు. రహదారి లేకపోవడంతో ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగు నుంచి మృతదేహం తరలించారు. ఇప్పటికైనా తమ కష్టాలు చూసి.. గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు గిరిజనులు. అయితే ఇప్పటికీ చాలా గ్రామాల్లో కూడా సరైన రహదారులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వర్షం పడిందంటే చాలు.. రోడ్లు తెగిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో వాగులోనుంచి గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొన్ని గ్రామాల్లో పరిస్థితులు ఇంకా దారుణంగా ఉంటున్నాయి. భారీ వర్షాలు పడితే.. ఈ ఊరికి ప్రపంచంతోనే సంబంధాలు తొలగిపోయే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల వల్ల ఆ గ్రామాలకు నిత్యవాసర సరకులు కూడా తెచ్చుకునేందుకు ఎన్నో అవస్థలు పడాల్సి వస్తుంది. అందుకే తమ గ్రామాల్లో ఇలాంటి పరిస్థితులు లేకుండా చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ప్రతి బుధవారం,శుక్రవారంమండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** మండల స్థాయి సమస్యలపై జిల్లా అధికారులు దృష్టిపెట్టేందుకు వీలుగా మండల స్థాయిలో కూడా జగనన్నకు చెబుదాం(జేకేసీ) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా పేర్కొన్నారు. శుక్రవారం యు.కొత్తపల్లి మండలానికి సంబంధించి జేకేసీ కార్యక్రమాన్ని స్థానిక సురక్షాఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా.. జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, జిల్లా రెవెన్యూ అధికారి కె.శ్రీధర్ రెడ్డి, జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, కాకినాడ ఆర్డీవో ఎన్.వీ.వీ.సత్యనారాయణ తదితరులతో కలిసి హాజరై యు.కొత్తపల్లి మండలం చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి బుధవారం, శుక్రవారం మండలస్థాయిలో జగనన్న చెబుదాం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సోమవారం జిల్లాస్థాయిలో జరుగుతున్న జగననన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరయ్యే జిల్లా స్థాయి అధికారులు అందరూ మండల స్థాయి జేకేసీ కార్యక్రమాన్ని కూడా హాజరవడం ద్వారా మండల స్థాయి సమస్యలపై దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటివరకు తాళ్ళరేవు, పెదపూడి, కిర్లంపూడి మండలాల్లో జేకేసీ కార్యక్రమాన్ని పూర్తిచేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారాలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. యు.కొత్తపల్లి మండల జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఉద్యోగం, ఉపాధి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ సమస్యలు, హౌసింగ్, తాగునీరు వంటి అంశాలపై మొత్తం-279 అర్జీలు అందాయని వాటి పరిష్కారం నిమిత్తం ఆయా శాఖల అధికారులకు పంపించడం జరిగిందని కలెక్టర్ కృతికా శుక్లా వివరించారు. మండల స్థాయిలో నమోదైన అర్జీలకు సబందించి ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యక్ష పరిశీలన చేసి నివేదికలు అందజేయనున్నట్లు వివరించారు. డెంగీ మరణం నమోదైన నేపథ్యంలో వాకతిప్ప గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్యులను అభినందించిన అధికారులు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఆచార్యులుగా పురస్కారాలు సాధించిన ఆచార్యులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో అభినందించారు. తన కార్యాలయంలో ఆచార్య ఎన్.కిషోర్ బాబు, ఆచార్య పి.శ్యామల, ఆచార్య సి.వి నాయుడు, ఆచార్య కె.సీతామాణిక్యం, ఆచార్య కె.రమాసుధ, ఆచార్య డి.లలిత భాస్కరిలను సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారిపై గొయ్యి పూడ్చివేత



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం నుండి కృష్ణదేవిపేట వెళ్ళే ప్రధాన రహదారి శివపురం వద్ద గల కల్వర్టుకు నడిరోడ్డు మధ్యలో పడిన గొయ్యికి శుక్రవారం మున్సిపల్ అధికారులు పూడ్చివేత చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద గొయ్యి అవ్వడంతో వాహనదారులు ఆ గొయ్యిలో పడి గాయాలపాలవుతున్నారు. దీంతో పౌర సేవ సంఘం పేరుతో అక్కడ ఒక చెట్టును పెట్టి ఆ చెట్టుకి రెండు బోర్డు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఫోటోతో ఇది జగనన్న గొయ్యి చూసుకొని వెళ్ళండి జాగ్రత్త అని బోర్డులు కూడా పెట్టడంతో స్పందించిన అధికారులు గొయ్యిని హుటాహుటిన పూడ్చి వేశారు.

## నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం ఏపి రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో శుక్రవారం నర్సీపట్నం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కొనేటి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి ఎంపికైన విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. ఇందులో గెలుపొందిన విజేతలకు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల పిఇటిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు అరికట్టేందుకు అందరూ సహకరించాలి



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** బాల్యవివాహాలు అరికట్టడానికి అందరూ సహకరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎపిఎస్సిపిసిఆర్) సభ్యులు గొండు సీతారాం కోరారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజాప్రతినిధులు, వార్డు సంరక్షణ, సంక్షేమ కార్యదర్శులకు, సంభందిత శాఖల అధికారులు, సిబ్బందికి బాల్య వివాహాల నిషేధ చట్టం, జిఓ నెంబర్ 31 పై స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ, వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాల్యవివాహాలు అరికట్టడానికి సమాజంలో అందరూ ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జిఓ నెంబరు 31 పట్ల అధికారులందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనకాపల్లి జిల్లాలో 22 బాల్యవివాహాలు జరగకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కొనేటి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కనకారావు, తహశీల్దార్ అన్నాజీరావు, ఎంపిపి సుర్ల రాజేశ్వరి, సిడిపిఓ సువార్త, ఎంపిడిఓ జయమాధవి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లిమర్ల మండలస్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం



**విజయనగరం:** జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరించే చర్యల్లో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం నెల్లిమర్ల మండల కేంద్రంలో నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ వర్గాల ప్రజల నుంచి 86 వినతులు స్వీకరించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మున్సిపల్ కమీషనర్ బాలాజీ ప్రసాద్, తహసిల్దార్ ధర్మ రాజు, ఎం.పి.డి.ఓ రామా రావు , మండల ప్రత్యేకాధికారి వినతులను స్వీకరించారు. మండలస్థాయి వినతుల స్వీకార కార్యక్రమంలో రెవిన్యూశాఖకు సంబంధించి 26, గృహనిర్మాణంకు సంబంధించి 16 , వైద్య ఆరోగ్య శాఖకు 4, పంచాయతీరాజ్‌కు 3, డి.ఆర్.డి.ఏ.కు 10, పంచాయతీరాజ్ కు 14 , ఆర్. డబ్లు.ఎస్ శాఖకు 5 , మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులు అందాయి.

స్పందన అనంతరం అధికారులతో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లా స్థాయి లో ప్రతి ఒక్కరూ హాజరు కాలేరని భావించి మండలాల్లో కూడా జగనన్నకు చెబుదాం వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా అధికారులంతా ఈ కార్యక్రమంలో స్వీకరించిన ప్రజావినతులను అర్జీ దారులో సంతృప్తిని పెంచే దిశగా పరిష్కరించాలని సూచించారు. నేటి స్పందన లో ఎక్కువగా రెవిన్యూ అంశాలు వచ్చాయని, తదుపరి ఆక్రమణలకు సంబంధించి, హౌసింగ్, విద్యుత్ శాఖలకు చెందిన వినతులు అందాయని చెప్పారు. ఆక్రమణలకు సంబంధించి ఇది వరకే ఆక్రమణల వివరాలన్నిటిని కోర్ట్ కు సమర్పించడం జరిగిందని, అదనంగా ఆక్రమణల పై ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని తెలిపారు. ప్రభుత్వ పథకాల పై ప్రజలకు పూర్తి అవగాహన లేకపోవడం వలన కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయని, ముందుగా పథకాల పై ఆయా శాఖలు సమగ్రంగా వివరించి అవగాహన కలిగించాలని సూచించారు.

నెల్లిమర్ల మండలంకు సంబంధించి జేకేసి లో ఇంతవరకు 240 రూరల్ లో, 111 అర్బన్ లో వినతులు అందాయని, రూరల్ లో 40 శాతం సంతృప్తి, అర్బన్ లో 60 శాతం సంతృప్తి గల పరిష్కారాలు జరిగాయని, ఈ శాతం ఇంకా పెరగాలని తెలిపారు. వినతుల పరిష్కారం లో మండల అధికారులంతా ఇంటర్ డిపార్టుమెంటల్ కో ఆర్డినేషన్ తో పని చేయాలని అన్నారు.

నెల్లిమర్ల నగర పంచాయతి వైస్ చైర్మన్ సముద్రపు రామ రావు జిల్లా కలెక్టర్ ను కలసి తొలిసారి మండలం లో జగనన్నకు చెపుదాం నిర్వహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నెల్లిమర్ల %--% జరజాపు పేట నగర పంచాయతిగా పేరు మార్చాలని కోరుతూ విజ్ఞప్తి చేసారు. అనంతరం జరజాపు పేట రైతు భరోసా కేంద్రానికి, శాఖా గ్రంధాలయానికి పక్కా భవన నిర్మాణానికి స్థలం , నిధులు మంజూరు చేయాలని వినతులను సమర్పించారు. అదే విధంగా జగనన్న లే అవుట్ వేసేందుకు స్థలం చదును చేయాలని , జరజాపుపేట లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు.

జేకేసి అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి గాంధీ నగర్ లో జరుగుతున్నా జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేసారు. ఇంటింటి తనిఖీ బృందం తో మాట్లాడి సర్వే చేస్తున్న తీరు పై ప్రశ్నించారు. లాగిన్ లో ఏ ఏ అంశాలు, ఎలా నమోదు చేస్తున్నారు , ప్రశ్నావళి ఎలా అడుగుతున్నారనే అంశాలను పరిశీలించారు. పలు కుటుంబ సభ్యులకు బి.పి చూడడం, షుగర్ పరీక్షలు నిర్వహించడం చేయించారు. టెస్ట్ ల ఫలితాలు పక్కాగా ఉండేలా చూడాలన్నారు. వాలంటీర్ ద్వారా మెడికల్ క్యాంపు కు ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా చూడాలన్నారు. బి పి , షుగర్ తనిఖీ చేసిన వారికీ కలెక్టర్ చేతుల మీదుగా టోకెన్లను అందజేసారి. ఈ టోకెన్లను తీసుకొని హెల్త్ క్యాంపు నకు హాజరు కావాలని వారికీ కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. భాస్కర రావు, మున్సిపల్ కమీషనర్ బాలాజీ ప్రసాద్, అర్బన్ పి.హెచ్ సి వైద్యులు డా. సమీర, ఎం.పి.డి.ఓ., తహసిల్దార్, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపమాక తిరువీధులలో దేవ దేవుడు



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలంలోని ఉపమాక ఆలయంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఇత్తడి సప్పరం వాహనంపై స్వామివారి తిరు వీధి సేవ కన్నుల పండువగా జరిగింది. ఉదయం కొండపై వున్న నిజరూపానికి ఆలయ అర్చకుడు సంకర్షణపల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు పంచామృతాభిషేకం చేసి, ధూప, దీప నైవేద్య, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కింద ఆలయంలో బాలభోగ నివేదనలు, ప్రత్యేక హెూమాలు నిర్వహించారు. అనంతరం సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో వేంచేపు చేసి గ్రామ బలిహరణలు పూర్తి చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి వేంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి ప్రత్యేక హారతులిచ్చారు. తదుపరి ఇత్తడి సప్పరం వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవ మూర్తిని అలంకరించి,మంగళవాద్యాల నడుమ తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది గురవయ్య రావూరి సురేష్, కొర్లాపు మహేష్, గ్రామానికి చెందిన రేజేటి సింగరాచార్యులు, పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలతో రైమ్స్ చెప్పించి అభినందించిన ఎంపీపీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మండలంలోని తగరంపూడి సచివాలయం పరిధిలో ఉన్న ఎస్సీ కాలనీ అంగన్వాడి కేంద్రం 2ను మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు పరిశీలించి కాసేపు ఉపాధ్యాయుడుగా మారి పిల్లలతో ఏబిసిడిలు రైమ్స్ చెప్పించి వారిని అభినందించారు, అంగన్వాడి సెంటర్ బాగా నిర్వహిస్తున్నారని అభినందించారు . ఈ సందర్భంగా నిర్వాహకులు అంగన్వాడీలో కొన్ని సమస్యలు ఎంపీపీ దృష్టికి తీసుకొని వచ్చారు. తక్షణమే వాటిని పరిష్కరించేలా సంబంధిత కాంట్రాక్టర్ కి ఫోన్ చేసి పనులు త్వరగా ప్రారంభించమని ఎంపీపీచెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ నరసింహారావు, ఈఓపిఆర్డి కే ధర్మారావు, తగరంపూడి సర్పంచ్ యదిగిరి అప్పారావు వైస్ ఎంపీపీ ఆయితా ఆనంద రాము, మొల్లి నాయుడు ,పోలమరిశెట్టి నర్సింగరావు,సుందరయ్యపేట సర్పంచ్ బాదపు తాతారావు ,మండల కో ఆప్షన్ సభ్యులు బొండా అప్పలరాజు, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ మొల్లి అప్పారావు. తదితరులు పాల్గొన్నారు.

### అండర్ 17 జిల్లా స్థాయి పోటీలకు దేవవరం హై స్కూల్ విద్యార్థులు

అభినందించిన ప్రధానోపాధ్యాయులు వేమగిరి నూకరాజు



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం దేవవరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి టెన్నికాయిట్ మరియు త్రో బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయులు వేమగిరి నూకరాజు స్థానిక పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ అండర్ 17 టెన్నికాయిట్ విభాగం పోటీలలో గణేష్, సతీష్ మరియు అండర్ ౧14 విభాగంలో వెంకటేష్, లోవరాజు ఎంపికైనట్లు తెలిపారు. త్రో బాల్ అండర్ 17 విభాగంలో గింజాల గణేష్ మరియు వెంకటేష్ ఎంపికైనట్లు తెలిపారు. ఈ మేరకు దేవవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమగిరి నూకరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు లచ్చబాబు నర్సింహా మూర్తి శేఖర్ తదితర ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## గొలుగొండలో "జగనన్నకు చెబుదాం"

ప్రతి సమస్యను వేగంగా పరిష్కరించాలి



**అనకాపల్లి/గొలుగొండ), (విశాఖ సమాచారమ్):** జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వచ్చిన అర్జీ లన్నింటిని వేగంగా పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటి గూర్చి వివరణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలను అనుసరించి జిల్లాలో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం శుక్రవారం గొలుగొండ మండలంలో నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు వచ్చి వారి సమస్యలను కలెక్టర్ కు విన్నవించుకున్నారు. స్పందన కార్యక్రమానికి 186 వినతులు వచ్చాయి. సమస్యలలో ఎక్కువగా భూతగాదాలు భూమి పట్టాలు ఇవ్వాలని ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని,తాగునీరు, సాగునీరు, దగ్గరలో వైద్య, పశు వైద్య సదుపాయాలు కావాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి నర్సీపట్నం అడిషనల్ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నర్సీపట్నం ఆర్డిఓ జయరాం, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి మంజుల వాణి, అర్జీలను స్వీకరించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పైడిమాంబ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడ సినిమా హాల్ జంక్షన్లో వినాయక చవితి సందర్భంగా శ్రీ పైడిమాంబ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని మండపం వద్ద శుక్రవారం వైకాపా రాష్ట్ర సీఈసీ సభ్యులు పైలా శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు వినాయకుని దర్శనం చేసుకొని ఆలయం వద్ద ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధన ప్రారంభించారు. సుమారు 2000 మంది భక్తులు ఈ అన్న సమారాధనలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పరవాడ పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసురావు, బురద రాజు, బొద్దపు అయ్యబాబు, సతీష్, జాను బాబు, జూనియర్ అప్పలనాయుడు, నరసింహమూర్తి, సన్నీ,నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** భారత ప్రభుత్వంచే గుర్తించబడిన హైదరాబాద్ కు చెందిన కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం( అలింకో) సంస్థ విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు అందించే రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ పఠాన్ శెట్టి రవి శుభాష్ ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలో యలమంచిలి పట్టణంలో గల శ్రీ గురజాడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28న జరుగు ఉపకరణాలు, సహాయ పరికరాల ఉచిత పంపిణీకి సంబంధించి దివ్యాంగులెవరైతే ఉన్నారో వారంతా తమకు కావాల్సిన ఉపకరణాలు, సహాయ పరికరాల గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలని యలమంచిలి, రాంబిల్లి మండలాధికారులు అప్పలనాయుడు, కె.ఎస్.కొండలరావులు గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలలో ఈ ఉపకరణములు తీసుకున్న వారు అనర్హులని,ఈ గుర్తింపు శిభిరంలో ఎటువంటి వైద్య ధ్రువీకరణ పత్రాలు గాని,పెన్షన్ లు కానీ మంజూరు చేయరని,కేవలం ఉపకరణాలు, సహాయ పరికరాల గుర్తింపు శిభిరం మాత్రమే అని అన్నారు.

## జిల్లా స్థాయి పోటీలకు కేజిబివి విద్యార్థినులు



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి గ్రామం కేజీబీవీ విద్యార్థునులలో క్రీడాకారిణులు అండర్-17 మరియు అండర్-14 సంవత్సరం లోపు విద్యార్థినులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు వీరిలో కబాడీ ౧17 సంవత్సరములోపు ఓ. ఐశ్వర్య ఖో ఖో విభాగం నుండి పి. రేణుక ఎంపికైనారు. కబాడీ-14 సంవత్సరముల లోపు సిహెచ్ కవిత ఎంపికయ్యారు ఖో ఖో విభాగం నుండి ౧14 సంవత్సరం వయసులోపు ఎం అనూష , పి త్రివేణి ఎంపికయ్యారు. ఈ విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ సలీమా, ఉపాధ్యాయునులు అభినందించారు.

# వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



**కలెక్టరేట్, (విశాఖ సమాచారమ్):** వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల్ని కేటాయించాలని కోరుతూ 'విశాఖ అక్రిడియేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ' (వీఏడబ్ల్యూహెచ్ఎస్) సభ్యులు వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులు ఎన్నో ఒడిదుడుకు లెదుర్కొంటూ మీడియా రంగంలో రాణిస్తున్నారని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయింపు డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు. సొసైటీ అధ్యక్షులు బి. రవి కాంత్, కార్యదర్శి యర్రా శ్రీనివాస్ సారథ్యంలో పలువురు మీడియా ప్రతినిధులు సర్క్యూట్ హౌస్‌లో వైవీని కలుసుకుని సమస్యను వివరించారు. 2006 నుంచి 2023వరకూ ఉన్న అక్రిడియేటెడ్ జర్నలిస్టులందరికీ ఇళ్ళ స్థలాలివ్వాలని కోరారు. సుమారు 18ఏళ్లగా విశాఖలో జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయింపు జరగలేదని వివరించారు. వైసీపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో జర్నలిస్టులకిచ్చిన హామీని ఆచరణలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. సొసైటీ ప్రతినిధుల డిమాండ్‌పై వైవీ సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయింపు జరుగుతుందని భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఈ విషయంలో సానుకూలంగా ఉన్నారని తెలిపారు. విశాఖలో జర్నలిస్ట్‌లకు స్థల కేటాయింపుపై చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. త్వరలోనే అందరికీ ఓ శుభవార్త చెబుతామన్నారు. వైవీని కలిసిన వారిలో సొసైటీ గౌరవాధ్యక్షులు జి.జనార్ధనరావు, సలహాదారు పి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పి. రామకృష్ణ, కె. పరశురాం, సహాయ కార్యదర్శులు ఎస్. అనూరాధ, ఎం.చిట్టిబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి డి. రవికుమార్, పీఏ రావు, సీనియర్ జర్నలిస్టు కీర్తన్, ఎస్‌కేబీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దసపల్లా హోటల్‌లో జరిగిన షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ పోర్టులకు సంబంధించి ముఖ్యంగా షిప్పింగ్‌కు సంబంధించిన క్రెయిన్స్, ట్రాన్స్‌పోర్టుకు 2024 రాబోయే సంవత్సరం నాటికి మరింత టెక్నాలజీని డెవలప్ చేయడానికి కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా క్రెయిన్స్ మెయింటెన్స్, ట్రాన్స్‌పోర్టుకు అనుగుణంగా టెకాలజీని అభివృద్ధి పరిచారు. పోర్టులోని లోడుతో వెలుతున్న లారీ ఏ షిప్పులోకి వెళ్లాలన్న దానికి తగినట్లుగా డ్రైవర్‌కు, పనిచేసే సిబ్బందికి, ఇంజనీర్లకు కంప్యూటర్ల ముందు కూర్చున్న వ్యక్తులకు ఈ టెక్నాలజీ వల్ల ముందుగానే వారికి సమాచారం అందుతుంది. ప్రతీ క్రెయిన్‌కు ముందుగానే కంప్యూటర్ టెక్నాలజీతో నడుస్తాయి. దీనికి అనుగుణంగా వాటిని రూపొందించారు. అందుకుగాను సెంట్రల్ గవర్నమెంట్ ఐసీఐసీఐ బ్యాంక్‌లు, ఇండస్ట్రీ పార్ట్‌నర్లు, ఇంటెగ్రల్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, మేరీటైమ్ గేట్‌వే తదితరులు పాల్గొన్నారు. రాబోయే తరానికి మొత్తం కంప్యూటర్లతో నడుపుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కరుణేంద్ర ఎస్.జాస్తి, జి.సాంబశివరావు, ఎల్‌టి.సిడిఆర్. రవీంద్రనాథ్ రెడ్డి, మెర్సీ, సి.వి.అచ్యుత రావు, కంకటాల మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో నేతల అంతర్యుద్ధం



తెలంగాణలో ఎన్నికల హీట్ రోజురోజుకూ పెరుగుతోంది. అన్ని పార్టీలు ప్రత్యర్థులను ఇరుకున పెట్టడంపై ప్రధానంగా దృష్టిసారిస్తున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ 115 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. కాంగ్రెస్ జాబితా ఈనెల 24న ప్రకటించనుంది. అయితే బీజేపీలో ఇప్పటి వరకు అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి కసరత్తు జరగలేదు. కేవలం దరఖాస్తుల ప్రక్రియ వరకే పరిమితమయ్యారు. 6 వేలకు పైగా అప్లికేషన్లు వచ్చాయి. అందులో నుంచి అభ్యర్థులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేస్తారనేది ఇప్పటి వరకు క్లారిటీ లేదు. వీటిపైనే బీజేపీ రాష్ట్ర నాయకత్వం తర్జనభర్జన పడుతోంది. ఇప్పటికే ఉన్న సమస్యలకు తోడు ఈటల రాజేందర్, విజయశాంతి వ్యవహారం తోడైంది. దీంతో బీజేపీ పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా మారింది.

ఫైర్ బ్రాండ్ విజయశాంతి కొన్ని రోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ప్రాధాన్యత దక్కడంలేదని అసంతృప్తితో ఉన్నారు. కొద్ది రోజులుగా ట్వీట్లతో హాట్ టాపిక్ గా మారారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి మాట్లాడే అవకాశం ఇచ్చి తనకు ఇవ్వకపోవడంతో ఆమె అలిగి వెళ్లిపోయారు. తెలంగాణను వ్యతిరేకించే వారితో వేదికను పంచుకోవడం ఇష్టంలేదని బహిరంగంగానే సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాన్ని వెళ్లగక్కారు. అలాగే బండి సంజయ్ మార్పుపైనా హర్ట్ అయ్యారని మొదటి నుంచి ప్రచారం జరిగింది. ఇందుకు కారణం ఈటలే అని పలువురు చర్చించుకుంటున్నారు. తాజాగా తాను పార్టీ మారుతున్నారని సొంత పార్టీ నేతలే ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయిన రాములమ్మ ఎవరిని ఉద్దేశించి ఆ ట్వీట్ చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది. అంతేకాకుండా చిట్ చాట్ పేరుతో పార్టీ అంతర్గత విషయాలను లీకులివ్వల బోనంటూ చేసిన ట్వీట్ ఎవరిని ఉద్దేశించి అన్నారనేది ఆసక్తికరంగా మారింది.

ఇకపోతే ఈటల రాజేందర్ సైతం తనపై పలువురు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మీడియా సమావేశంలో చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయన చేసిన వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించి అన్నది కూడా ఆసక్తికరంగా మారింది. టిఫిన్ మీటింగ్, లంచ్ మీట్లకు భయపడేది లేదని రాజేందర్ ఘాటుగా స్పందించారు. ఎవరికి వారుగా ఎదగాలి తప్పితే పక్కవారిని తొక్కి పైకొచ్చే పద్ధతిని మార్చుకోవాలని ఈటల స్ట్రాంగ్ వార్నింగే ఇచ్చారు. అయితే ఈ వ్యాఖ్యలు ఎవరిని ఉద్దేశించారన్నదే చర్చనీయాంశంగా మారింది.

మొత్తానికి ఈ ఇద్దరి నాయకుల గురించే బీజేపీలో చర్చ జరుగుతోంది. ఎన్నికల సమయంలో ఇలాంటి అంత ర్యుద్ధాలు పార్టీని ఎలాంటి పరిస్థితులకు తీసుకెళ్తుందో చూడాల్సిందే.

# అమలు జరగని రిజర్వేషన్లకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలా?

## ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లు లేవా?



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** 2024 నుంచిఅమలు జరుపుతారని ఆశించిన మహిళా రిజర్వేషన్లు 2029 నుంచి అమలు జరుగుతాయా లేక 2034 నుంచి అమలు జరుగుతాయా అనేది తెలియదు. ఆ నాటికి ఏ ప్రభుత్వం అమలు జరుపుతుందో తెలియదు. దీనికోసం ఇంత ఆదరాబాదరాగా పార్లమెంటు ప్రత్యేక సమావేశం జరపడం పెద్ద ఫార్స్ అని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. శుక్రవారం స్థానిక రింగ్ రోడ్ లో ఉన్న డివిఆర్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.మహిళా రిజర్వేషన్ల బిల్లు చిత్తశుద్ధితో ఆమోదించింది కాదు. దీనిని 2024 నుంచి అమలు జరపడానికి జనాభా లెక్కలు, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన కమిటీలు అవసరం లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళల జనాభాను పరిగణలోకి తీసుకుని వచ్చే ఎన్నికల నుంచే అమలు జరపవచ్చు. పెద్ద నాయకుల నియోజకవర్గాలు ఎక్కడ మహిళలకు రిజర్వు అయిపోతాయో అనే భయంతోనే నిరవధిక వాయిదా చట్టాన్ని ఆమోదించడం దేశంలోని మహిళలను మోసగించడానికే. ప్రస్తుతం దేశంలో ప్రజామోదం. ఉన్న ప్రధాని మోదీ ఇటువంటి అపసవ్య బిల్లును ఆమోదించడం అవసరమా అని ప్రశ్నించారు.

అమలుకు సమయ నిర్దేశం లేని ఈ బిల్లులో మహిళల కోటాలో ఓబీసీలు, మైనారిటీలకు 33 శాతం అంతర్గత రిజర్వేషన్లను ఎందుకు పెట్టలేదు? మళ్లీ ఎప్పుడో మరోసారి రాజ్యాంగ సవరణ చేస్తారా? మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఉన్నప్పుడు ములాయంసింగ్ యాదవ్. లాలూ ప్రసాద్ యాదవ్ లాంటి నాయకులు ఓబీసీలకు అంతర్గత రిజర్వేషన్లు పెట్టాలని డిమాండు చేయడం వల్ల రాజ్యసభలో ఆమోదించిన మహిళా బిల్లు లోక్సభలో అడుగు పెట్టలేకపోయింది. ఇప్పుడు పార్టీలు ఓబీసీలకు రిజర్వేషన్లు పెట్టడానికి అంగీకరించినప్పుడు కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లలో ఓబీసీలకు స్థానం ఇచ్చేందుకు ఎందుకు నిరాకరించారు? ధనికులతో పోరాడలేని సాధారణ ఓబీసీ మహిళలకు రాజ్యాంగ సవరణ ద్వారా చట్టసభల్లో స్థానం ఇవ్వరా? 75 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో ఓబీసీ మహిళలకు సామాజిక న్యాయం అందించరా అన్నారు.పార్లమెంటు ఆమోదించిన మహిళా బిల్లు ప్రకారం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2004 ఎన్నికల నుంచి అమలుచేయండి. లేదా ఓబీసీలకు 33 శాతం అంతర్గత రిజర్వేషన్లు కల్పిస్తూ వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని కోరుతూ రాష్ట్రపతికి, ప్రధానికి, కేంద్ర హోం మంత్రికి, రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి మాజీ మంత్రి వీరభద్రరావు లేఖలు రాశారు.

# జగనన్నకు చెబుదాం అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించా లని జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం విశాఖ రూరల్ మండలం, యన్టీఆర్ కాలనీ సచివాలయం అవంతి ఫంక్షన్ హాల్ నందు మండల స్థాయి ''జగనన్నకు చెబుదాం '' ( స్పందన ) కార్యక్రమం నిర్వహించారు. విశాఖ రూరల్ మండల పరిధిలో ఉన్న గ్రామ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా ప్రతి సోమవారం జిల్లా ప్రధాన కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జగన స్నకు చెబుదాం కార్యక్రమం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మండల స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాటు చేసిందని చెప్పారు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 8వ తేది నుండి అక్టోబర్ 13 వ తేది వరకు బుధవారం, శుక్రవారం వారంలో రెండు రోజులలో మండల కేంద్రాలలో నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో గల ప్రతి మండలాన్ని కవర్ చేసే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్దేశిత తేదీలలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దీనిలో భాగంగా ఈరోజు విశాఖ రూరల్ మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం (స్పందన ) నిర్వ హించామని తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు నాణ్యమైన పరిష్కారాలు అందించాలని, ఫిర్యాదులు పునరా వృతం కాకుండా తగిన చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై పూర్తి శ్రద్ధతో ఉండాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పూర్తిగా పరిశీలించి సరైన సమాధానం ఇవ్వాలని అన్నారు. నిర్దేశించిన సమయంలో గా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పుడు ఇచ్చిన అర్జీలను జెకేసి పోర్టల్ నందు అప్లోడ్ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రతి అధికారి తమ శాఖ కు చెందిన అన్ని అర్జీలు పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని తెలిపారు. ముఖ్యంగా సచివాలయ సిబ్బంది జేకేసి పై పూర్తి శ్రద్ధ వహించి పనిచేయాలన్నారు. వచ్చిన అర్జీలలో 90 శాతం సచివాలయాల పరిధిలోనే ఉంటున్నాయని పేర్కొన్నారు. అర్జీలు బియాండ్ ఎస్-ఎల్ఏ లో లేకుండా చూడాలని అన్నారు. విభాగాధిపతులం దరూ ఈ కార్యక్రమం పై పూర్తి శ్రద్ధ వహించి పనిచేయాలన్నారు. వచ్చిన అర్జీలలో ప్రధానంగా రెవెన్యూ, జివిఎంసి , హౌసింగ్ , ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల నుండి వచ్చిన విజ్ఞప్తులను సకాలంలో విచారణ జరిపి సత్వర చర్యలు తీసుకుంటామని అన్నారు. శుక్రవారం విశాఖ రూరల్ నిర్వహించిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 60 విజ్ఞప్తులు అందాయి.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె ఎస్ విశ్వనాథన్ , ఆర్ డి ఓ భాస్కర్ రెడ్డి, జివియంసి అడిషనల్ కమిషనర్ వర్మ, పోలీస్ అధికారులు, వివిధ శాఖల జిల్లా , డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ ల క్రీడలు అభినందనీయం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ వెబ్ జర్నలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం క్రికెట్ టోర్నీ ప్రారంభమైంది.. ఇక్కడ ఆంధ్రా మెడికల్ కాలేజ్ గ్రౌండ్స్ లో (చిన్నా మెమోరియల్ )రెండు రోజుల పాటు జరగనున్న ఈ టోర్నీలో వివిధ ప్రాంతాలకు చెందిన ఏడు జట్లు పాల్గొన్నాయి.. అయా క్రికెట్ పోటీలను సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు జాతీయ జర్నలిస్ట్ లు సంఘం కార్యదర్శి గంట్ల శ్రీను బాబు పాల్గొని మాట్లాడుతూ జర్నలిస్ట్ క్రీడలు అభినందనీయం అన్నారు.. ప్రతీ ఒక్కరూ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి అందరి మన్ననలు పొందాలి అన్నారు.. సమాజానికి నిరంతరము సేవలు అందించే జర్నలిస్ట్ లు క్రీడల్లో పాల్గొంటే మెరుగైన ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయన్నారు.. అనంతరం వీరంతా శ్రీను బాబు ను ఘనము గా సత్కరించారు.. ఈ పోటీల్లో నిర్వాహకులు రామ కృష్ణ, మోహన్, సతీష్, నాగరాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

National Seminar
Recent Trends on Applications of Radio Isotopes & Radiation Technologies
ARIRT – 2023
Andhra University, Visakhapatnam,
September 28-29, 2023
Organized by
Department of Nuclear Physics, Andhra University, Visakhapatnam
&
National Association for Application of Radioisotopes

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776, Yelamanchili : 9441356676